విశాఖపట్టణం
మంగళవారం 24 ఫిబ్రవరి 2026

For a pure tomorrow..

జయ జయహే

jayajayahey.in సంపుటి: 9 సంచిక: 31 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool


# కల్తీ పాలు తాగి నలుగురు చిన్నారులు మృతి

రాజమహేంద్రవరంలో ఘటన

సీఎం చంద్రబాబు సీరియస్

దర్యాప్తు జరిపి నివేదిక ఇవ్వాలని ఆదేశాలు



2

# స్వర్ణాంధ్ర విజన్‌తో ఆదాయం పెరుగుదల

రూ. 3 లక్షల నుంచి రూ. 54 లక్షలకు పెంచుతాం

సూపర్ సిక్స్.. సూపర్ హిట్

సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టీకరణ

బడ్జెట్ కేటాయింపులపై చర్చలో కీలక వ్యాఖ్యలు



ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సోమవారం సంక్షేమ బడ్జెట్ కేటాయింపులపై చర్చించారు. సామాజిక సమానత్వం అనే లక్ష్యం కోసం ఎన్డీయే కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని వ్యాఖ్యానించారు. రాజకీయంగా కూడా వెనకబడిన వర్గాలకు ప్రాధాన్యం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. సంక్షేమం విషయంలో సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ చేశామని ఉద్ఘాటించారు. ఆటో కార్మికులు, మత్స్యకారులు, చేనేతలకు కూడా మేలు చేశామని తెలిపారు.

నిత్యావసర సరకులు కూడా సక్రమంగా అందించేలా సాంకేతికత సాయం తీసుకున్నామని చంద్రబాబు పేర్కొన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల కోసం ఎక్కువ కేటాయింపులు చేశామని చెప్పుకొచ్చారు. బడ్జెట్ కేటాయింపులు అమలు చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తామని వివరించారు. స్వర్ణాంధ్ర - 2047 విజన్‌లో భాగంగా తలసరి ఆదాయం రూ.3 లక్షల నుంచి రూ.54 లక్షలకు పెంచడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భావితరాల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించామన్నారు. అంగన్‌వాడీ నుంచి స్కూళ్లు, కాలేజీల వరకూ మంచి విద్య, వైద్యం అందించేలా చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. పేద వర్గాల ఆదాయం పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారించామని సీఎం ..మిగతా 2లో




# 28నే పెన్షన్లు పంపిణీ

మార్చి 1 ఆదివారం కావడంతో ప్రభుత్వ నిర్ణయం

(అమరావతి - జయజయహే)

పించన్‌దారులకు భారీ గుడ్‌న్యూస్ అందింది. ఈ సారి పించన్ సొమ్ము ఒకరోజు ముందుగానే చేతికి అందనుంది. ఈ మేరకు ఒకరోజు ముందుగానే పింఛన్ సొమ్ము లబ్ధిదారులకు అందించాలని కూటమి సర్కార్ నిర్ణయం తీసుకుంది. ఒకరోజు ముందుగానే చేతికి అందనుండటంతో పింఛన్‌దారులు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు మార్చి నెల పింఛన్ ఒకరోజు ముందుగానే అందించాలని స్వర్ణ వార్డు, గ్రామ సచివాలయ సిబ్బందికి తాజాగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ సారి మార్చి 1వ తేదీన ఆదివారం వస్తోంది. ఆ రోజు ప్రభుత్వ ఆఫీసులకు సాధారణ సెలవు రోజు కావడంతో ఫిబ్రవరి 28వ తేదీనే పంపిణీ చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. ఆ రోజున ఇంటి వద్దకే వెళ్లి నేరుగా లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేయనున్నారు. ఫిబ్రవరి 28వ తేదీన ఉదయం నుంచి సచివాలయ సిబ్బంది లబ్ధిదారులు పింఛన్ అందించనున్నారు. సాయంత్రం వరకు అందించనున్నారు. ఒకవేళ ఫిబ్రవరి 28వ తేదీన తీసుకోనివారికి మార్చి 2వ తేదీన అందించనున్నారు. ఫిబ్రవరి 1వ తేదీన కూడా ఆదివారం రావడంతో జనవరి 31న లబ్ధిదారులకు ..మిగతా 2లో

# తిరుమల దర్శనాలకు కొత్త చట్టం



డిక్లరేషన్ పై ఖచ్చితంగా ఉండాలని నిర్ణయం

స్వర్ణ దేవాలయం తరహాలో నియమాలు

రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

తిరుమల శ్రీవారి పవిత్రతను కాపాడేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దర్శనానికి సంబంధించిన నిబంధనలను మరింత కఠినతరం చేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు డిక్లరేషన్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని టీటీడీకి ఆదేశాలు జారీ చేసింది. ఇక నుంచి ఎవరైనా అన్యమతస్తులు శ్రీవారిని దర్శించుకోవాలంటే తప్పనిసరిగా డిక్లరేషన్ ఇవ్వాల్సిందేనని పేర్కొంది. ఇప్పటివరకు ఈ నిబంధన ఉన్నా అంతగా అమలు కావడం లేదు. స్వచ్ఛందంగా కొంతమంది డిక్లరేషన్ ఇచ్చేందుకు ముందుకొస్తున్నాయి. కొంతమంది డిక్లరేషన్ ఇవ్వకుండానే దర్శించుకుంటున్నారు. ఇక నుంచి ఈ నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. తిరుమల ఆలయం పవిత్రతను రక్షించేందుకు ఈ మేరకు సోమవారం ఏపీ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

ప్రస్తుతం ఏపీ అసెంబ్లీలో సమావేశాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా తిరుమల లడ్డూ కల్తీ అంశం అసెంబ్లీని కుదిపేస్తుంది. అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య సభలో వాగ్వాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ క్రమంలో అసెంబ్లీలోని సీఎం చాంబర్‌లో ..మిగతా 2లో



## ఇండియా ఫైనల్‌కు వెళ్తే
# మళ్ళీ మ్యాచ్‌కు వెళ్తా

జగన్ వస్తానంటే.. తీసుకు వెళ్తా.. నాకు దేశభక్తి ఉంది

మీడియా చిట్ చాట్‌లో మంత్రి నారా లోకేశ్

(అమరావతి - జయజయహే)

టీ 20 వరల్డ్ కప్‌లో భాగంగా జరిగిన భారత్ వర్సెస్ పాకిస్తాన్ మ్యాచ్‌ను వీక్షించేందుకు ఐటీ మంత్రి నారా లోకేష్ విదేశాలకు వెళ్లడంపై వైసీపీ నేతలు విమర్శలు గుప్పించిన విషయం అందిరికి ..మిగతా 2లో



# జాబ్ క్యాలెండర్‌తోనే డీఎస్సీ

ఉగాది పండగ సందర్భంగా విడుదల

పాలిటెక్నిక్, ఐటీఐలను అభివృద్ధి చేస్తున్నాం

సభలో ప్రభుత్వం ప్రకటన

(అమరావతి - జయజయహే)

శాసనసభ సమావేశాల్లో భాగంగా 8వ రోజు ప్రశ్నోత్తరాలు సాగాయి. ఈ సందర్భంగా రాష్ట్రంలోని విద్యావ్యవస్థ, నిరుద్యోగుల సమస్యలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి నారా లోకేశ్ సమాధానమిచ్చారు.రాష్ట్రంలోని నిరుద్యోగులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న జాబ్ క్యాలెండర్‌ను ఉగాది పండుగ సందర్భంగా విడుదల చేస్తామని మంత్రి లోకేశ్ ప్రకటించారు. విశేషమేమిటంటే, ఈ జాబ్ క్యాలెండర్‌లోనే డీఎస్సీ ..మిగతా 2లో

# అసెంబ్లీలోనే కల్తీ నెయ్యి నిజాలు

పూర్తి వాస్తవాలు, ఆధారాలు ప్రవేశ పెడతాం

వైసీపీది మహాపచారం

శాసనసభకు రమ్మని బొట్టు పెట్టి పిలవలా

మంత్రి నారా లోకేశ్ సంచలన వ్యాఖ్యలు



(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

అసెంబ్లీ లాబీల్లో మంత్రి నారా లోకేష్ మీడియాతో జరిపిన చిట్ చాట్ రాజకీయంగా అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రధానంగా తిరుమల లడ్డూ కల్తీ అంశంపై ఆయన విపక్ష వైఎస్సార్‌సీపీపై విరుచుకుపడ్డారు. దేవదేవుడికి జరిగిన మహాపచారానికి సంబంధించిన పూర్తి వాస్తవాలను, ఆధారాలను అసెంబ్లీ వేదికగానే బయటపెడతామని ఆయన స్పష్టం చేశారు. దేవుడిని కూడా రాజకీయాల కోసం రోడ్డు మీదకు తీసుకురావడం, దేవుడి ఫోటోలతో చట్టసభల్లో ర్యాలీలు చేయడం ..మిగతా 2లో

# ఖైదీలకు క్షమాభిక్షపై ప్రభుత్వం సానుకూలం: హోం మంత్రి



2

# బీహార్ ఐజీ సునీల్ నాయక్ అరెస్టు

రఘురామ కస్టోడియల్ టార్చర్ కేసులో అదుపులోకి

బీహార్‌లో మెరుపు దాడులు చేసిన ఆంధ్రా పోలీసులు

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)



వైఎస్ జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలోని గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎంపీ, ప్రస్తుత ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజును కస్టడీలో వేధించినట్లు నమోదైన 'థర్డ్ డిగ్రీ' కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుల్లో ఒకరైన సీనియర్ ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్‌ను ఆంధ్రప్రదేశ్ పోలీసులు బిహార్‌లోని పట్నాలో ..మిగతా 2లో

For a pure tomorrow.. జయహో

# కల్తీ పాలు తాగి నలుగురు చిన్నారులు మృతి

### రాజమహేంద్రవరంలో ఘటన

### సీఎం చంద్రబాబు సీరియస్

### దర్యాప్తు జరిపి నివేదిక ఇవ్వాలని ఆదేశాలు

**(రాజమహేంద్రవరం - జయజయహే)**

కల్తీ పాల ప్రభావంతో రాజమహేంద్రవరంలో ప్రజలు చనిపోతున్నారన్న ఘటనపై సమగ్ర విచారణ జరపాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్, ఎస్పీ మరియు వైద్యారోగ్య శాఖ అధికారులతో ఆయన సమీక్షించారు. బాధితులకు అందుతున్న వైద్య సేవలు, మరణాలకు గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులందరికీ ఎటువంటి లోటు లేకుండా మెరుగైన వైద్య సహాయం అందించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. కల్తీ పాల ఘటనలో మృతుల సంఖ్య నాలుగుకు చేరడం స్థానికంగా కలకలం రేపుతోంది.

కల్తీ పాల సరఫరాకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని చంద్రబాబు స్పష్టం చేశారు. బాధితుల కుటుంబాలకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందించాలని అధికారులను సూచించారు. ఘటనకు దారితీసిన పరిస్థితులపై సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.



**నాలుగుకు చేరిన మరణాలు.. స్థానికుల్లో ఆందోళన**

రాజమహేంద్రవరంలోని లాలాచెరువు చౌడేశ్వరినగర్ ప్రాంతంలో పాలు తాగడంతో కిడ్నీలు ఫెయిలై ప్రాణాలు పోతున్నాయి. ఇదివరకే ఇద్దరు చనిపోగా, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుల్లో సోమవారం ఉదయం మరో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. మృతులను రాధాకృష్ణమూర్తి (74), ఎన్. శేషగిరిరావు (72)గా అధికారులు గుర్తించారు. తాజా మరణాలతో కలిపితే మొత్తం నలుగురు వ్యక్తులు కిడ్నీలు ఫెయిలై చనిపోయారని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. ఇదిరకే భాగిశెట్టి కనకరత్నం, తాడి కృష్ణవేణి అనే ఇద్దరు వృద్ధులు పాలు తాగడంతో కిడ్నీలు ఫెయిలై చనిపోయారని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ 15వ తేదీ తర్వాత నుంచి ఒక్కొక్కరుగా అస్వస్థతకు లోనయ్యారు. వారిలో ఇదివరకే ఇద్దరు చనిపోగా, తాజాగా మరో ఇద్దరు చనిపోవడంతో స్థానికంగా ఆందోళన చెందుతున్నారు.

చౌడేశ్వరినగర్ పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు 12 మంది వాంతులు, పొట్ట ఉబ్బడం, మూత్రవిసర్జన కాకపోవడం వంటి తీవ్రమైన లక్షణాలతో ఆసుపత్రుల్లో చేరారు. పలు ఆస్పత్రుల్లో చేరి బాధితులు చికిత్స పొందుతున్నారని, కిడ్నీ ఫెయిలై చనిపోయినట్లు కలెక్టర్ తెలిపారు. త్వరలో పూర్తి స్థాయిలో వివరాలు వెల్లడిస్తామన్నారు. బాధితులలో 60 ఏళ్లు పైబడిన వృద్ధులతో పాటు ఐదు నెలల పసికందు, మూడేళ్ల బాలుడు ఉన్నాడు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు.

**పాలు అమ్మిన వ్యక్తి అరెస్ట్..**

బాధితులందరికీ కోరుకొండ మండలానికి చెందిన గణేష్ అనే వ్యక్తి పాలు పోస్తున్నట్లు అధికారులు గుర్తించారు. శివరాత్రి రోజున పాలు, పెరుగు చేదుగా ఉన్నాయని బాధితులు తెలిపారు. కల్తీ పాలు తాగడమే వారి అనారోగ్యానికి కారణమని బాధితులు చెబుతున్నారు. ఈ క్రమంలో పోలీసులు నిందితుడు గణేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. బాధితుల నుంచి సేకరించిన రక్త, మూత్ర నమూనాలను ఇప్పటికే టాక్సికాలజీ పరీక్షల నిమిత్తం పంపించారు. ఆ నివేదికలు వచ్చిన తరువాతే కిడ్నీలు ఫెయిల్ కావడానికి, వారి మరణాలకు ఆ పాలు కారణమా లేదా వేరే కారణాలు ఉన్నాయా అనేది తేలనుంది.

## 28నే పెన్షన్లు పంపిణీ

మొదటి పేజీ తరువాయి...

పింఛన్ పంపిణీ చేశారు. ఈ సారి కూడా మార్చి 1న సండే రావడంతో ఫిబ్రవరి నెలలోనే పింఛన్ పంపిణీకి సిద్ధమయ్యారు. ప్రతీ నెలా ఒకటో తేదీన ప్రభుత్వం పింఛన్ సొమ్ము అందిస్తోంది. ఆ రోజు ఆదివారం వస్తే ముందు రోజే ఇస్తూ వస్తోంది. దీని వల్ల లబ్ధిదారులు పింఛన్ ఎప్పుడు వస్తుందా.. లేదా అని ఎదురుచూడాల్సిన అవసరం ఉండదు. ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ల పథకం ద్వారా వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి ప్రతీ నెలా పింఛన్ అందిస్తోంది. వృద్ధులు, వితంతువులకు రూ.4 వేలు ఇస్తోండగా.. దివ్యాంగులకు రూ.6 వేలు ఇస్తోంది. ఇక దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి రూ.10 వేల పింఛన్ అందిస్తోంది. సచివాలయం సిబ్బంది నేరుగా లబ్ధిదారుల ఇంటికే వెళ్లి బయోమెట్రిక్ వివరాల ఆధారంగా సొమ్ము అందిస్తున్నారు. అయితే పింఛన్ పంపిణీ చేసేందుకు సీఎం చంద్రబాబు ప్రతీ నెలా ఒక జిల్లాలో పర్యటిస్తున్నారు. లబ్ధిదారులకు నేరుగా తన చేదుల మీదుగా పింఛన్ అందించి వారితో మాట్లాడుతున్నారు. వారి బాగోగులు, ఆర్థిక పరిస్థితులు తెలుసుకుంటున్నారు. ఈసారి చంద్రబాబు పర్యటన ఎక్కడ ఉంటుందనేది ఇంకా షెడ్యూల్ ఖరారు కాలేదు. త్వరలోనే ఈ షెడ్యూల్ ఖరారు అయ్యే అవకాశముందని తెలుస్తోంది.

## జాబ్ క్యాలెండర్‌తోనే డీఎస్సీ

మొదటి పేజీ తరువాయి...

పోస్టులను కూడా చేర్చనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఇది ఉపాధ్యాయ వృత్తిని ఆశించే వేలాది మంది అభ్యర్థులకు పెద్ద ఊరటనిచ్చే అంశం.

కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల పనితీరుపై ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్, ఎమ్మెల్యే మురళీ మోహన్ పలు అంశాలను ప్రస్తావించారు. ఏపీలో కేజీబీవీ పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతితో పాటు ఇంటర్మీడియట్ కూడా అందిస్తున్నారని, ఇక్కడ పనిచేస్తున్న వారికి ఎంటిఎస్ అమలు చేయాలని, రెగ్యులర్ ప్రిన్సిపాళ్లను నియమించాలని కోరారు.

దీనికి మంత్రి నారా లోకేశ్ సమాధానమిస్తూ.. ఇతర రాష్ట్రాల కంటే ఏపీలో కేజీబీవీలకు ఎక్కువ డిమాండ్ ఉందని, అడ్మిషన్ల కోసం తీవ్రమైన పోటీ నెలకొందని తెలిపారు. జీతాల పెంపుదలపై కేంద్ర ప్రభుత్వంతో చర్చించామని, కేంద్రం సహకారం అందిస్తే మరిన్ని చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

**పాలిటెక్నిక్, ఐటీఐ విద్య బలోపేతం**

ఉన్నత విద్యలో ఇంజనీరింగ్‌తో పాటు పాలిటెక్నిక్, ఐటీఐల ప్రాధాన్యాన్ని మంత్రి వివరించారు. ఉత్తరాంధ్రలో ఏర్పడుతున్న పారిశ్రామిక ఎకో సిస్టమ్‌కు అనుగుణంగా విద్యార్థుల్లో నైపుణ్యాలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. విజయనగరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మరమ్మతులను 'క్లస్టర్ బేస్డ్ అప్రోచ్' ద్వారా వచ్చే ఏడాదిలోగా పూర్తి చేస్తామని మంత్రి వెల్లడించారు.

## బీహార్ ఐజీ సునీల్ నాయక్ అరెస్టు

మొదటి పేజీ తరువాయి...

అదుపులోకి తీసుకున్నారు. బిహార్ రాష్ట్రంలో ఐజీగా విధులు నిర్వహిస్తున్న సునీల్ నాయక్‌ను పట్టుకునేందుకు ఏపీ పోలీసుల బృందం పట్నా వెళ్ళింది. గత కొంతకాలంగా ఈ కేసులో విచారణకు హాజరుకావాలని పలుమార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ, ఆయన స్పందించకపోవడంతో పోలీసులు ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారు.

**కేసు నేపథ్యం ఇదీ..**

వైసీపీ ప్రభుత్వ హయాంలో సునీల్ నాయక్ ఏపీ సీఐడీలో ఐజీగా డిప్యుటేషన్‌పై పనిచేశారు. 2021లో రాజద్రోహం కేసులో తనను అరెస్టు చేసిన సమయంలో, సీఐడీ కస్టడీలో ఉండగా తనపై సునీల్ నాయక్ నేతృత్వంలో థర్డ్ డిగ్రీ ప్రయోగించారని రఘురామకృష్ణరాజు ఫిర్యాదు చేశారు. తన కాళ్లపై తీవ్రంగా కొట్టడం, మానసికంగా వేధించడం వంటి చర్యల్లో సునీల్ నాయక్ కీలక పాత్ర పోషించారని రఘురామ తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

సునీల్ నాయక్‌ను అదుపులోకి తీసుకున్న వెంటనే ఏపీ పోలీసులు బిహార్ ప్రభుత్వానికి అధికారికంగా సమాచారం అందించారు. పట్నాలోని స్థానిక కోర్టులో ఆయనను హాజరుపరిచి ట్రాన్సిట్ వారెంట్ (ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి నిందితుడిని తరలించే అనుమతి) కోరారు. కోర్టు అనుమతి లభించడంతో ఇవాళ రాత్రికి ఆయనను విమానంలో లేదా రోడ్డు మార్గంలో గుంటూరుకు తీసుకువచ్చే అవకాశం ఉంది.

ఈ అరెస్టుతో ఏపీలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. గత ప్రభుత్వ హయాంలో అత్యుత్సాహం ప్రదర్శించిన అధికారులపై కూటమి ప్రభుత్వం చర్యలు ప్రారంభించిందనే సంకేతాలు ఈ ఘటనతో స్పష్టమవుతున్నాయి. ఈ కేసులో మరికొందరు ఉన్నతాధికారులు కూడా విచారణను ఎదుర్కొనే అవకాశం ఉన్నట్లు కనిపిస్తోంది.



## స్వర్ణాంధ్ర విజన్‌తో ఆదాయం పెరుగుదల

మొదటి పేజీ తరువాయి...

చెప్పారు. ఆర్థిక అసమానతలు తొలగించటానికి చర్యలు తీసుకుంటున్నామని చంద్రబాబు తెలిపారు. 10 లక్షల బంగారు కుటుంబాలను లక్షమంది మార్గదర్శకులు దత్తత తీసుకున్నారని వివరించారు. 'నిరంతరం పర్యవేక్షిస్తేనే ఏ కార్యక్రమమైనా ఫలితాలనిస్తుంది. అట్టడుగున ఉన్న పేదవర్గాలనూ ఆదుకునేలా పీ4 ప్రణాళికలు ఉన్నాయి. పూటగడవని పేదవారిని ఎలా పైకి తీసుకురావాలో అందరూ ఆలోచించాలి. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నిర్దేశించారు. ఈ లక్ష్యాన్ని సాధించాలంటే పేదరికం ఉండరాదు. 2024 ఎన్నికల్లో ఏకపక్షంగా కూటమికి 94 శాతం విజయం కట్టబెట్టారు. బీసీలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కమిషన్ వేశాం. స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చే సమయానికి రిజర్వేషన్లు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం' అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

**ఆ ఘనత ఎన్డీఏదే..**

బీసీ జాబితాలోని కొన్ని వర్గాలను ఎస్సీ, ఎస్టీల్లో చేర్చాలనే డిమాండ్లను కూడా పరిశీలిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. 'ఎస్సీ వర్గీకరణ తెచ్చి.. ఆ దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించిన ఘనత ఎన్డీఏ ప్రభుత్వానికి దక్కింది. గిరిజనుల కోసం తెచ్చిన జీఓఎంఎస్ నంబర్-3ని సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ విషయంపై ఏం చేయాలో గిరిజన సంఘాల నుంచి అభిప్రాయలు సేకరించి ముందుకెళ్తాం. మైనార్టీ వర్గాలకు కూటమి ప్రభుత్వం రక్షణ కల్పించింది' అని సీఎం చెప్పారు.

## అసెంబ్లీలోనే కల్తీ నెయ్యి నిజాలు

మొదటి పేజీ తరువాయి...

అత్యంత ఆక్షేపణీయమని ఆయన మండిపడ్డారు. వైసీపీ గైర్హాజరు కావడంపై లోకేష్ తనదైన శైలిలో స్పందించారు. శాసనసభకు రావాలని ఎవరికీ బొట్టు పెట్టి పిలవాల్సిన అవసరం లేదని, ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులుగా సభకు వచ్చి చర్చల్లో పాల్గొనడం వారి బాధ్యత అని హితవు పలికారు. సభను బహిష్కరించడం ద్వారా వారు ప్రజలకు ఏం సమాధానం చెబుతారని నిలదీశారు. యువగళం పాదయాత్ర తర్వాత ప్రజలతో ఏర్పడిన చిన్న విరామాన్ని భర్తీ చేసేందుకు, ప్రజాప్రతినిధుల కుటుంబాలతో ఆత్మీయ భేటీలు నిర్వహిస్తున్నానని, వీటిలో ఎలాంటి రాజకీయాలూ లేవని వివరించారు.

హెరిటేజ్ వ్యాపారాల అంశంపై వస్తున్న ఆరోపణలను లోకేష్ తీవ్రంగా తిప్పికొట్టారు. హెరిటేజ్ సంస్థకు, ఇందాపూర్ డెయిరీకి ఎటువంటి యాజమాన్య సంబంధం లేదని, అది కేవలం కో-ప్యాకర్ మాత్రమేనని క్లారిటీ ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో సాక్షి మీడియా, భారతి సిమెంట్స్ వంటి సంస్థలు వెయ్యి కోట్ల రూపాయల మేర ప్రజాధనంతో లబ్ధి పొందాయని, కానీ తమ కుటుంబ సంస్థ హెరిటేజ్ ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం నుంచి ఆశించలేదన్ను. ఈ అంశంలో ఎలాంటి చర్చకు అయినా సరే సవాల్ విసిరారు. కిలో వెయ్యి రూపాయలు ఉండే నెయ్యిని కేవలం 360 రూపాయలకే కొనుగోలు చేయడం ద్వారానే గత పాలకులు నాణ్యతను బలిపెట్టారని విమర్శించారు.



## ఏక సభ్య కమిషన్‌కు ఓకే


### గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సుప్రీమ్ కోర్టు

**(ఢిల్లీ - జయజయహే)**

తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగం వ్యవహారంలో ఏక సభ్య కమిటీ ఏర్పాటుపై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించిన ఏక సభ్య కమిటీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ అంశంపై సోమవారం విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం ఈ మేరకు తీర్పు వెలువరించింది. లడ్డూ వ్యవహారంపై సీబీఐ నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఇచ్చిన నివేదికపై రిటైర్డ్ ఐఏఎస్ అధికారి దినేశ్ కుమార్ ఆధ్వర్యంలో ఏకసభ్య కమిటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో బీజేపీ సీనియర్ నేత సుబ్రహ్మణ్య స్వామి పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలో ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ కేసులో ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ, సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రాతో సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. సిట్ నివేదికను పరిశీలించి.. పరిపాలనా లోపాలు, టెండర్ అవకతవకలు, బాధ్యులను గుర్తించడానికే ఈ కమిటీని నియమించినట్లు న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లింది ప్రభుత్వం. అలాగే సీబీఐ సిట్ విచారణకు ఎలాంటి ఆటంకం ఉండదని స్పష్టం చేసింది.

## తిరుమల దర్శనాలకు కొత్త చట్టం

మొదటి పేజీ తరువాయి...



పలువురు మంత్రులు సీఎం చంద్రబాబుతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తిరుమలలో ఎలాంటి అపచారాలు చోటుచేసుకోకుండా తీసుకోవాల్సిన చర్యలపై మంత్రులతో చంద్రబాబు చర్చించారు. ఈ సందర్భంగా స్వర్ణ దేవాలయం చట్టాన్ని అధ్యయనం చేయాలని అధికారులను చంద్రబాబు ఆదేశించారు. స్వర్ణ దేవాలయం తరహాలోనే తిరుమలలోనూ కొత్త చట్టాన్ని తీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ చట్టం అమలు చేయడం వల్ల తప్పు చేసినవారిపై క్రిమినల్ చర్యలు తీసుకునే అవకాశముంటుంది.

**తిరుమలలోనూ కొత్త చట్టం**

స్వర్ణ దేవాలయం చట్టంపై అధ్యయనం చేసిన తర్వాత అసెంబ్లీలో ప్రభుత్వం బిల్లు ప్రవేశపెట్టనుంది. అనంతరం బిల్లును ఆమోదించాక కొత్త చట్టం అమల్లోకి రానుంది. ఇటీవల తిరుమల చుట్టూ అనేక వివాదాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో కొత్త చట్టంలో కఠిన నిబంధనలు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం యోచిస్తోంది. గత ఏడాది కాలంగా తిరుమల లడ్డూ కల్తీ నెయ్యి అంశం రాష్ట్ర రాజకీయాలను కుదిపేస్తుంది. ఇప్పటికే సిట్ విచారణ చేపట్టి కల్తీ జరిగినట్లు నిర్ధారించింది. వైసీపీ మాత్రం ఎలాంటి కల్తీ జరగలేదని వాదిస్తోంది. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాల్లో కూడా ఈ అంశం చుట్టూ రాజకీయ వేడి నెలకొంది.

## ఖైదీలకు క్షమాభిక్షపై ప్రభుత్వం సానుకూలం: హోం మంత్రి

**అమరావతి, ఫిబ్రవరి 23:-**

జైలులోని ఖైదీలకు క్షమాభిక్ష విషయంలో కూటమి ప్రభుత్వం సానుకూలంగా ఉందని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. సోమవారం 8వ రోజు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జైళ్లు, సంస్కరణల చట్టం సవరణపై బిల్లును అసెంబ్లీలో హోంమంత్రి అనిత ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూ.. ఖైదీల సంస్కరణల కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. కేంద్రం తెచ్చిన చట్టం మేరకు ఇక్కడ కూడా సంస్కరణలు అమలు చేస్తున్నామన్నారు. ఖైదీలు జైలులో ఉండి చదువుకునేలా అవకాశాలను మెరుగుపరుస్తున్నామని చెప్పారు. ఖైదీల్లో పరివర్తన తీసుకురావటం కోసం చట్టంలో మార్పులు తీసుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా ఖైదీల పిల్లల కోసం జైలులో ప్రత్యేకంగా అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఖైదీల నేరచరిత్ర, ప్రవర్తన ఆధారంగా కేటగిరీలుగా విభజిస్తామని పేర్కొన్నారు. ఖైదీలు మారేందుకు, మానసిక పరివర్తన తెచ్చేలా ఓపెన్ ఎయిర్ జైళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఖైదీలు.. వ్యవసాయంతో పాటు ఇతర వృత్తులు నిర్వహించేలా చర్యలు చేపడతామన్నారు.

## ఇండియా ఫైనల్‌కు వెళ్తే మళ్ళీ మ్యాచ్‌కు వెళ్తా

మొదటి పేజీ తరువాయి...

తెలిసిందే. తాజాగా దీనిపై మంత్రి నారా లోకేష్ మరోసారి చిట్‌చాట్ ద్వాకా స్పందించారు. టీ20 వరల్డ్ కప్‌లో ఇండియా ఫైనల్‌కు వస్తే మళ్లీ మ్యాచ్ చూడడానికి వెళ్తానని అన్నారు. పులివెందుల ఎమ్మెల్యే జగన్ వస్తానంటే ఆయనకు కూడా టికెట్ తీసి మ్యాచ్ చూపిస్తానన్నారు. నాకు దేశ భక్తి ఉంది, నేను వెళ్తా అని చెప్పుకొచ్చారు.అలాగే హెరిటేజ్ విషయంపై కూడా ఆయన మాట్లాడారు. హెరిటేజ్‌కు ఇందపూర్‌కు ఎలాంటి సంబంధం లేదన్నారు. పన్నీర్, చీజ్ తయారీలో మాత్రమే హెరిటేజ్‌ఉఇందపూర్ కలిసి పనిచేస్తున్నాయని వివరణ ఇచ్చారు. వ్యాపార భాగస్వామ్యాన్ని తప్పుగా అర్థం చేసుకొంటున్నారని.. హెరిటేజ్ సంస్థకు ప్రభుత్వానికి సంబంధం ఏంటని ప్రశ్నించారు. హెరిటేజ్ లిస్టెడ్ కంపెనీ? అని సీనియర్ లీడర్ బొత్స కు కో పార్టనర్ కు, కో మాన్యుఫాక్చరర్ కు తేడా తెలియకపోవడం దారుణమన్నారు.

# ఇంటర్ పరీక్షలు ప్రారంభం

**రాష్ట్ర వ్యాప్తంగా 10.57 లక్షల మంది హాజరు**

**- పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు.. 144 సెక్షన్ అమలు**

**- ఈ ఏడాది నుంచి కొన్ని సబ్జెక్టులకు 32 పేజీల జవాబు పత్రం**

**విశాఖపట్నం, ఫిబ్రవరి 23, జయ జయహే :**



రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటలకు మొదటి సంవత్సరం విద్యార్థులకు పరీక్ష మొదలైంది. నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమని ఇంటర్ బోర్డు ముందుగానే స్పష్టం చేయడంతో విద్యార్థులు గంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. ఈ పరీక్షలు మధ్యాహ్నం 12 గంటల వరకు కొనసాగుతాయి. ఈ ఏడాది ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు 5,31,275 మంది, మంగళవారం నుంచి ప్రారంభమయ్యే రెండో సంవత్సరం పరీక్షలకు 5,26,264 మంది దరఖాస్తు చేసుకున్నారు. మొత్తంగా 10,57,899 మంది విద్యార్థుల కోసం రాష్ట్రవ్యాప్తంగా 1,537 పరీక్ష కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రతి పరీక్ష కేంద్రం వద్ద సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేయడంతో పాటు 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ బోర్డు జవాబు పత్రాల్లో కొన్ని మార్పులు చేసింది. ఫస్టియర్ విద్యార్థులకు గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఎకనామిక్స్ వంటి కొన్ని ప్రధాన సబ్జెక్టులకు 32 పేజీల బుక్‌లెట్‌ను అందిస్తున్నారు. మిగిలిన సబ్జెక్టులకు, సెకండియర్ విద్యార్థులకు 24 పేజీల బుక్‌లెట్‌ను ఇచ్చారు. అదనపు జవాబు పత్రాలు ఇవ్వరు. ఈ పరీక్షలు మార్చి 24వ తేదీ వరకు జరగనున్నాయి. మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌ల వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను కేంద్రాల్లోకి అనుమతించబోమని అధికారులు స్పష్టం చేశారు.



## రాజమహేంద్రవరం కల్తీ పాలు ఘటనపై
# వైసీపీ నేతల ఆగ్రహం

**ప్రభుత్వం వాస్తవాలు దాచిపెడుతోందని ఆరోపణ**

**రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:**

రాజమహేంద్రవరంలో చోటుచేసుకున్న కల్తీ పాలు విషాద ఘటనపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అనేక మంది బాధితులు ఉన్నప్పటికీ ప్రభుత్వం కేవలం ఐదుగురు మాత్రమే ప్రభావితమయ్యారని "కాకి లెక్కలు" చెబుతోందని రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆరోపించారు. జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో "రెడ్ బుక్ రాజ్యాంగం" నడుస్తోందని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాల్సిన ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించడంపైనే దృష్టి సారిస్తోందని విమర్శించారు. రాజమండ్రిలో కల్తీ పాలు తాగి ఐదుగురు మృతి చెందినప్పటికీ కూటమి నాయకులు కనీసం స్పందించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికీ ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు బాధిత కుటుంబాలను పరామర్శించి భరోసా కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనలో సుమారు 16 మంది ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని, మరికొందరి పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. వారం రోజులుగా సంఘటన చోటుచేసుకున్నప్పటికీ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు సీఎం నారా చంద్రబాబు నాయుడు ప్రకటించిన రూ. 10లక్షల ఎక్స్‌గ్రేషియా సరిపోదని జక్కంపూడి రాజా విమర్శించారు. ఇప్పటికే బాధిత కుటుంబాలు వైద్యం కోసం సుమారు రూ. 8.50 లక్షలు ఖర్చు చేశాయని, ఈ సహాయం "ముష్టి వేసినట్టే"నని అన్నారు. పాలు ఎలా కల్తీ అయ్యాయన్న అంశంపై ఇప్పటికీ స్పష్టత ఇవ్వకపోవడం ప్రభుత్వ వైఫల్యమని ఆరోపించారు. బాధితులకు పూర్తిస్థాయి ఉచిత వైద్య సేవలు అందించాలని, లేదంటే కుటుంబాలతో కలిసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాల్ మాట్లాడుతూ ఘటనపై సమగ్ర దర్యాప్తు చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణాలకు సంబంధించి నిర్లక్ష్యం అస్సలు సహించబోమని స్పష్టం చేశారు.



## కల్తీ పాల ఘటనపై జక్కంపూడి
# విజయలక్ష్మి ఆవేదన

**చౌడేశ్వరి నగర్‌లో బాధిత కుటుంబాలకు భరోసా**

**రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:**

రాజమహేంద్రవరం నగరంలో చోటుచేసుకున్న కల్తీ పాల ఘటనపై వైఎస్సార్సీపీ నాయకురాలు జక్కంపూడి విజయలక్ష్మి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనలో అస్వస్థతకు గురైన రాజమహేంద్రవరం బోలినేని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ఆమె పరామర్శించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో వివరంగా మాట్లాడి, అందిస్తున్న వైద్యసేవలపై సమాచారం తీసుకున్నారు. బాధితులకు అత్యుత్తమ వైద్యం అందించాలని, అవసరమైతే మెరుగైన చికిత్స కోసం ఇతర వైద్యసంస్థలకు తరలించే చర్యలు తీసుకోవాలని వైద్యులను కోరారు. ఈ సందర్భంగా బాధితులతో మాట్లాడారు. కల్తీ ఆహార పదార్థాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం చౌడేశ్వరి నగర్‌లో పర్యటించిన జక్కంపూడి విజయలక్ష్మి, కల్తీ పాల కారణంగా మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి, ధైర్యం చెప్పి ఆర్థికంగా, సామాజికంగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబాల సమస్యలను స్వయంగా తెలుసుకుని, సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కల్తీ పాల ఘటన అత్యంత దురదృష్టకరమని, దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే వారిని ఏ మాత్రం ఉపేక్షించకూడదని స్పష్టం చేశారు. నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద ఆహార పదార్థాలపై వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని ఆమె సూచించారు.



# రాజమహేంద్రవరంలో ఆక్యూట్ రీనాల్ ఫెయిల్యూర్ కేసులు

**ప్రజలు భయాందోళన చెందవద్దు: కలెక్టర్ కీర్తి చేకూరి... సంయమనం పాటించాలి: ఎస్పీ డి. నరసింహ కిషోర్**

**రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:**



రాజమహేంద్రవరం నగరంలో నమోదైన ఆక్యూట్ రీనాల్ ఫెయిల్యూర్ కేసులపై ప్రజలు ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి విజ్ఞప్తి చేశారు. వై జంక్షన్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎస్పీ డి. నరసింహ కిషోర్, నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనాతో కలిసి సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. చౌడేశ్వరినగర్, స్వరూప్‌నగర్ ప్రాంతాల్లో కిడ్నీ సంబంధిత కేసులు నమోదైన వెంటనే జిల్లా యంత్రాంగం అప్రమత్తమైందని కలెక్టర్ తెలిపారు. జిల్లా పరిపాలన, వైద్య ఆరోగ్య, ఆహార భద్రత, పోలీసు, రెవెన్యూ, పశుసంవర్ధక శాఖలు మరియు మున్సిపల్ అధికారులు సమన్వయంతో తక్షణ చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక బృందాల ద్వారా ఇంటింటి సర్వే నిర్వహిస్తూ అవసరమైన వైద్య సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. డయాలసిస్ అవసరమైన 12 మంది నగరంలోని వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని తెలిపారు. వీరందరికీ ఒకే పాలవ్యాపారి పాలు సరఫరా చేసినట్లు గుర్తించి, అతడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఆ వ్యాపారి పాలు సరఫరా చేసిన 106 కుటుంబాలకు రక్తపరీక్షలు నిర్వహిస్తుండగా, ఇప్పటివరకు 73 కుటుంబాల నుంచి నమూనాలు సేకరించినట్లు వెల్లడించారు. నిరంతర వైద్య పర్యవేక్షణ కొనసాగుతోందన్నారు. పశుసంవర్ధక శాఖ 46 పశువులకు పరీక్షలు నిర్వహించి నమూనాలను ప్రయోగశాలలకు పంపింది. ఆహార భద్రత అధికారులు సేకరించిన పాలు, పెరుగు నమూనాలను హైదరాబాద్, విశాఖపట్నం ల్యాబ్‌లకు పంపారు. నివేదికలు వచ్చిన వెంటనే తదుపరి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమగ్ర నివేదిక కోరినట్లు తెలిపారు. బాధితులకు అత్యుత్తమ వైద్యసేవలు అందించడంతో పాటు మూలకారణాలను త్వరితగతిన గుర్తించాలని ఆదేశాలు ఇచ్చినట్లు వెల్లడించారు. ఫిర్యాదుల కోసం హెల్ప్‌లైన్ నంబర్ 9494060060ను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. అధికారిక హెల్త్ బులెటిన్ విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఎస్పీ డి. నరసింహ కిషోర్ మాట్లాడుతూ ఇప్పటివరకు నాలుగు మరణాలు సంభవించినట్లు వెల్లడించారు. మృతులు ఎన్. శేషగిరిరావు (72), రాధాకృష్ణమూర్తి (74), తాడి కృష్ణవేణి (76), తాడి రమణి (58)గా గుర్తించారు. పోస్టుమార్టం నివేదికలు రావాల్సి ఉన్నట్లు చెప్పారు. అనధికార డెయిరీని సీజ్ చేసి పాలవ్యాపారిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. చిన్నపిల్లలు, వృద్ధులే ఎక్కువగా ప్రభావితమైనట్లు గుర్తించామని, కొన్ని రోజులు పాలను బాగా మరిగించి మాత్రమే వినియోగించాలని ప్రజలకు సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. వె. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వికారంతో కూడిన వాంతులు, మూత్ర విసర్జన తగ్గడం వంటి లక్షణాలు నమోదైనట్లు తెలిపారు. 60 ఏళ్లు పైబడినవారే ఎక్కువగా ఆస్పత్రుల్లో చేరినట్లు చెప్పారు. ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణ కొనసాగుతున్నట్లు వెల్లడించారు. సమీక్ష సమావేశంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డా. పి.వి.వి. సత్యనారాయణ తదితర అధికారులు పాల్గొన్నారు.



## గంజాయి, మత్తు, మాదక ద్రవ్యాలపై
# అవగాహన సదస్సు

**అనకాపల్లి (జయ జయహే)**

గాంధీనగరంలో డి ఎన్ టీ సాంఘిక సంక్షేమ వసతి గృహంలో బ్రైట్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు గంజాయి, మత్తు, మాదక ద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథి సమస్త కార్యదర్శి తాతపూడి జయశ్రీ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు అలవాటు పడిన విద్యార్థులు , యువకులు చదువును నిర్లక్ష్యం చేస్తూ విద్యను కోల్పోతూ, అనారోగ్యపరమైన సమస్యలకు లోను అవుతున్నారని అన్నారు మాదక ద్రవ్యాలకు మత్తులో అమ్మాయిలు, మహిళలు, విద్యార్థులు పట్ల అసభ్యంగా ప్రవర్తించడం, దొంగతనాలు చేస్తున్నారన్నారు. మత్తు పదార్థాలను సరఫరాచేసేన , వాటికి అలవాటు పడిన, అసాంఘిక అలవాట్లను ప్రేరేపించే వారుగా, కారకులుగా శిక్షార్హులే అన్నారు. మాదకద్రవ్యాల నిరోధానికి భారత ప్రభుత్వం నార్కోటిక్స్,డ్రగ్స్ అండ్ సైకో ట్రాఫిక్ సబ్జె న్సస్ చట్టాలను తీసుకువచ్చిందన్నారు. మత్తు పదార్థాలకు బానిసలవ్వకుండా మంచి నడవడిక, నైతిక విలువలు పెంపొందించుకుని మంచి పౌరులుగా ఎదగాలని యువతకు, పిలుపునిచ్చారు ఈ సందర్భంగా వసతి గృహం వార్డన్ నారాయణరావు మాట్లాడుతూ బ్రైట్ స్వచ్ఛంద సేవా సంస్థ సమాజంలో కళాశాలలో పాఠశాలల్లో విద్యార్థుల కొరకు యువతీ యువకుల కొరకు ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా వారిలో నైతిక విలువలు సత్ప్రవర్తన అలబడటానికి అవకాశం ఉంటుందని తెలిపారు ఈ సందర్భంగా సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమాలను ప్రశంసించడం జరిగింది ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు కాళ్ళ శివ శంకర్ సమస్త ప్రతినిదులు సిహెచ్ ప్రదీప్ కుమార్ పి.వి.కిరణ్మయి, , బి.బి.వి. ప్రసాద్ కె ఎస్ జ్యోతి కుమారి హాస్టల్ సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు...




## బంగారమ్మ ఆలయ పునఃనిర్మాణం
# పేరుతో అక్రమ వసూళ్లు


**కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన గ్రామస్థులు**

**విశాఖపట్నం /అగనంపూడి (జయ జయహే)**

విశాఖపట్నం కలెక్టర్ కార్యాలయం లో గ్రీవెన్స్ సందర్భంగా కలెక్టర్ కు కొండయ్యవలస గ్రామ ప్రజల ఆరాధ్య దేవత మరిడిమాంబ, బంగారమ్మ ఆలయ అభివృద్ధి కమిటీ మరియు గ్రామ పెద్దలు కలిసి ఆలయ కమిటీకి గ్రామ పెద్దలకు ఎటువంటి విషయం చెప్పకుండా ఏకపక్షంగా పట్టా రామ అప్పారావు పామల వసంత కొంతమంది కలిసి బంగారమ్మ ఆలయ పునర్నిర్మాణం చేస్తామని పండగ మార్చి 4వ తేదీన ప్రకటిస్తే ఐదో తేదీన బంగారమ్మ ఆలయ పునర్మాణ శంకుస్థాపన చేస్తామని డబ్బులు వసూలు చేస్తున్నారని . ఆచారం ప్రకారం పండగ చాటిపు తర్వాత ఎటువంటి పనులు చెయ్యి రాదని కమిటీ చెప్పినప్పటికీ వ్యతిరేకిస్తూ పనులు ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నారు. ఊరు ప్రజలు ఆచారం ప్రకారం మనోభావాలు దెబ్బ తీసే విధంగా దీనిపై అభ్యంతరం తెలుపుతూ వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా కలెక్టర్ ను కోరుతూ ఫిర్యాదు చేయడం జరిగినది. ఈ కార్యక్రమం లో ఆలయ కమిటీ అధ్యక్షులు బలిరెడ్డి శ్రీనివాసరావు, కార్యదర్శి బుదిరెడ్డి అప్పారావు, గ్రామ పెద్దలు మరిసా రామచంద్రరావు, సాయన సన్యాసిరావు, బలిరెడ్డి సత్యనారాయణ, వడ్డాది శ్రీనివాసరావు, బండారు చందు రమేష్, పలక అచ్యుత్ ,విందుల కళ్యాణ్ పాల్గొని కలెక్టర్ కార్యాలయం ఎదురుగా అక్రమ వసూళ్లు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని నిరసన వ్యక్తం చేసారు .

## ఘనంగా మోదకొండమ్మ అమ్మవారి
# తీర్థ మహోత్సవం

**బుచ్చయ్యపేట జయ జయహే**




వడ్డాది జంక్షన్ లో కొలువై ఉన్న మొదకొండమ్మ అమ్మవారి వారి తీర్థ మహోత్సవం మంగళవారం నుండి గురువారం వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ దొండ గిరిబాబు తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రోజుల పాటు అమ్మవారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు ప్రసాదాలు వితరణ చేపడుతున్నామని తెలిపారు. పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారని ఆయన కోరారు.

For a pure tomorrow.. జయహో



## జాగ్రత్తలేమే సైబర్ నేరగాళ్లకు అస్త్రం

(సి.హెచ్.ప్రతాప్)

కళ్లకు కనిపించని లాభాల మాయలో పడి, జీవితాంతం శ్రమించి కూడబెట్టిన నిజమైన సంపదను కోల్పోతున్న ఈ పరిస్థితి మన సమాజాన్ని ఏ దిశగా నడిపిస్తోంది? అనే ప్రశ్న నేడు ప్రతి పౌరుడి మనసును కలచివేయాల్సిన అవసరం ఉంది.. అంతర్జాతీయ షేర్ మార్కెట్లలో అద్భుత లాభాలు అంటూ చేసిన ఒక ఫోన్ కాల్, మహారాష్ట్రలోని థానేకు చెందిన 73 ఏళ్ల వృద్ధుడి జీవితాన్ని అతలాకుతలం చేసింది. ఇది ఒక్కరి విషాదం కాదు; డిజిటల్ యుగంలో పెరుగుతున్న సైబర్ మోసాల భయానక రూపానికి తాజా ఉదాహరణ.

అక్టోబర్ఉనవంబర్ 2025 మధ్యకాలంలో జరిగిన ఈ ఘటన, సైబర్ నేరగాళ్ల చాకచక్యాన్ని మరోసారి బట్టబయలు చేసింది. +44 వంటి యూకే కోడ్‌తో వచ్చిన కాల్స్, నమ్మకాన్ని పెంచేందుకు చక్కగా రూపొందించిన మాటలు, లాభాలను చూపించే నకిలీ వెబ్‌సైట్లు ఉ ఇవన్నీ ఒక పథకం ప్రకారం అమలు చేసిన మోసమే. "తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు" అనే మాట విన్నప్పుడు తడబడని మనిషి ఎవరు? ఆ ఆశనే ఆయుధంగా మలచుకుని, మోసగాళ్లు ఆ వృద్ధుడిని దశలవారీగా రూ.5.11 లక్షలు పెట్టుబడి పెట్టేలా చేశారు.

ఆనందం ఎక్కువ రోజులు నిలువలేదు. లాభాలను విత్‌డ్రా చేసుకునే ప్రయత్నంలో వెబ్‌సైట్లు కనిపించకుండా పోయాయి. ఫోన్లు స్విచ్ ఆఫ్ అయ్యాయి. అప్పటికే ఆలస్యం అయింది. జీవితాంతం పొదుపు చేసిన సొమ్ము, కొన్ని క్లిక్‌లలో గాలిలో కలిసిపోయింది. చివరకు పోలీసులను ఆశ్రయించినా, నేరస్తులు ఇప్పటివరకు పట్టుబడలేదు. దర్యాప్తు కొనసాగుతోందన్న అధికారుల మాటలు బాధితుడికి కొంత ఊరట ఇచ్చినా, నష్టం మాత్రం తీరనిది.

ఇక్కడ ఆలోచించాల్సినది ఒక్కటే ఉ ఈ మోసానికి బాధితుడు మాత్రమే బాధ్యుడా? లేక అతివేగంతో లాభాల వెనుక పరిగెత్తుతున్న మన సామూహిక మనస్తత్వమే దీనికి కారణమా? సైబర్ నిపుణులు హెచ్చరిస్తున్నట్లే, తెలియని వ్యక్తులు, ముఖ్యంగా విదేశీ నంబర్ల నుంచి ఫోన్ చేసి పెట్టుబడుల పేరుతో ఆకర్షిస్తే, అందులో మోసం దాగి ఉందని ప్రతి పౌరుడు గ్రహించాల్సిన అవసరం ఉంది. ధ్రువీకరించని వెబ్‌సైట్లు, యాప్‌లలో బ్యాంకు వివరాలు నమోదు చేయడం అంటే, నేరగాళ్లకు తాళాలు ఇవ్వడమే.

డిజిటల్ ప్రపంచం అవకాశాలతో పాటు ప్రమాదాలను కూడా మోస్తోంది. సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్నంత వేగంగా, అవగాహన పెరగకపోతే ఇలాంటి ఘటనలు పునరావృతమవుతూనే ఉంటాయి. ముఖ్యంగా వృద్ధులు, సామాన్యులు లక్ష్యంగా మారుతున్నారు. కుటుంబ సభ్యులు, సమాజం, ప్రభుత్వం ఉ అందరూ కలిసి ఆర్థిక సైబర్ అవగాహనను ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాలి.

చివరగా ఒకటే స్పష్టంగా చెప్పాలి: లాభాలు ఆకాశాన్ని తాకుతాయని ఎవరు చెప్పినా, ముందు మన కాళ్లు నేలపై ఉన్నాయో లేదో చూసుకోవాలి. జాగ్రత్త అనే కవచం లేకపోతే, డిజిటల్ ప్రపంచంలో ఒక్క క్లిక్ కూడా ప్రాణాంతకంగా మారుతుంది. అప్రమత్తతే రక్ష. అవగాహనే ఆయుధం.

## మారుతున్నసూక్ష్మ, చిన్న, మధ్య తరహా

# పరిశ్రమల దశ

(సి.హెచ్.ప్రతాప్)

భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక వంటి సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల దశ మారుతోంది. ఒకప్పుడు రుణాల కోసం బ్యాంకుల చుట్టూ తిరగడం, భారీగా కాగితపు పత్రాలు సమర్పించడం, నెలల తరబడి వేచి చూడటం వంటి సవాళ్లతో సతమతమైన చిన్న వ్యాపారులకు ఇప్పుడు ఆధునిక గణాంక విశ్లేషణ పద్ధతులు ఒక సంజీవనిలా మారాయి. కేవలం తొమ్మిది నెలల కాలంలోనే, అంటే ఏప్రిల్ నుండి డిసెంబర్ 31, 2025 మధ్య కాలంలో, ప్రభుత్వ రంగ బ్యాంకులు ఏకంగా మూడు లక్షల తొంభై ఆరు వేల రుణ దరఖాస్తులను ఆమోదించి, యాభై రెండు వేల మూడు వందల కోట్ల రూపాయలకు పైగా నిధులను మంజూరు చేయడం ఒక చారిత్రాత్మక ఘట్టంగా నిలిచింది. ఈ మార్పు వెనుక ఉన్న ప్రధాన శక్తి రుణ అర్హత అంచనా వేసే సరికొత్త విధానం. ఇది కేవలం ఒక సాంకేతిక ప్రక్రియ మాత్రమే కాదు, బ్యాంకింగ్ రంగంలో పెను మార్పులకు నాంది పలికిన ఒక విప్లవం. ఇది పూర్తిగా వ్యాపారి యొక్క అంతర్జాల లావాదేవీల ఆధారంగా పనిచేస్తుంది. గతంలో ఒక వ్యాపారి ఆర్థిక స్థితిగతులను





అంచనా వేయడానికి మనుషులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసేవారు, కానీ ఇప్పుడు ఈ కృత్రిమ మేధస్సు ఆధారిత వ్యవస్థ వ్యాపార లావాదేవీల పారదర్శకతను తక్షణమే విశ్లేషిస్తుంది. బ్యాంక్ ఖాతా వివరాలను సెకన్లలో పరిశీలించి, సదరు వ్యాపార సంస్థ యొక్క ఆర్థిక సామర్థ్యాన్ని మరియు తిరిగి చెల్లించే శక్తిని ఖచ్చితంగా అంచనా వేస్తుంది. దరఖాస్తుదారుడి గుర్తింపు ధృవీకరణ, గత రుణ చరిత్ర, మరియు సాధ్యమయ్యే మోసాల తనిఖీలను యంత్రాలే స్వయంచాలక పద్ధతిలో పూర్తి చేస్తాయి.

ఈ వినూత్న విధానం వల్ల చిన్న వ్యాపారులకు అనేక ప్రయోజనాలు చేకూరుతున్నాయి. ప్రధానంగా బ్యాంక్ శాఖల చుట్టూ పదేపదే తిరగాల్సిన అవసరం తప్పింది. వ్యాపారులు తమ నివాసం లేదా కార్యాలయం నుండే అంతర్జాలం ద్వారా రుణాల కోసం దరఖాస్తు చేసుకునే వీలు కలిగింది. గతంలో వారాల తరబడి పట్టే రుణ ప్రక్రియ ఇప్పుడు అతి తక్కువ కాలంలోనే పూర్తవుతోంది. మనిషి ప్రమేయం లేకుండా కేవలం దత్తాంశాల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవడం వల్ల పక్షపాతానికి తావు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతోంది. అంతేకాకుండా, కాగితపు పత్రాల భారం దాదాపుగా మాయమైపోయింది. కేవలం వేలిముద్రలు లేదా సెల్‌ఫోన్ సందేశాల ద్వారా జరిగే ధృవీకరణలు రుణ మంజూరును సులభతరం చేశాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులు ప్రవేశపెట్టిన ఈ నమూనా ఆధారిత అంచనా విధానం కొత్తగా వ్యాపారంలోకి అడుగుపెట్టేవారికి మరియు ఇప్పటికే ఉన్న ఖాతాదారులకు సమాన అవకాశాలను కల్పిస్తోంది.

వ్యాపార విస్తరణకు అవసరమైన మూలధనం సకాలంలో అందడం వల్ల గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయి. దేశీయ ఉత్పత్తుల తయారీ వేగవంతం కావడానికి ఇది ఒక చోదక శక్తిగా మారింది. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా, చిన్న పరిశ్రమలు ఆర్థిక స్వావలంబన సాధించడంలో ఈ దత్తాంశ ఆధారిత బ్యాంకింగ్ వ్యవస్థ ఒక బలమైన పునాదిగా నిలుస్తోంది. పారదర్శకత పెరగడం వల్ల బ్యాంకుల నిరర్థక ఆస్తుల భయం కూడా తగ్గుతోంది, ఎందుకంటే కేవలం నిజమైన లావాదేవీలు ఉన్నవారికే రుణాలు అందుతున్నాయి. ఈ సాంకేతిక విప్లవం భవిష్యత్తులో భారతీయ చిన్న తరహా పరిశ్రమలను ప్రపంచ స్థాయి పోటీకి సిద్ధం చేయడమే కాకుండా, దేశ ఆర్థిక ప్రగతిలో వాటి భాగస్వామ్యాన్ని మరింత పెంచుతుంది అనడంలో ఎటువంటి సందేహం లేదు. చిన్న వ్యాపారుల సాధికారతకు ఈ ఆధునిక రుణ వితరణ పద్ధతులు నిరంతరం అండగా నిలుస్తాయి.


# యువతను క్రుంగదీస్తున్న ఫోమో


(సి.హెచ్.ప్రతాప్)

***నేటి ఆధునిక యుగంలో సాంకేతిక విప్లవం మానవ జీవనశైలిని పూర్తిగా మార్చివేసింది. ముఖ్యంగా యువతలో 'ఫోమో' (ఫియర్ ఆఫ్ మిస్సింగ్ అవుట్) అనే మానసిక స్థితి ఒక తీవ్రమైన సమస్యగా మారుతోంది. ఏదైనా ఒక ఆసక్తికరమైన విషయం లేదా సంఘటన తన ప్రమేయం లేకుండా జరిగిపోతోందని, ఇతరులు తనకంటే మెరుగైన జీవితాన్ని గడుపుతున్నారనే ఆందోళన చెందడమే ఈ స్థితికి ప్రధాన లక్షణం. ఈ ధోరణి యువత మానసిక ఆరోగ్యంపై, వారి దైనందిన జీవితంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. సామాజిక మాధ్యమాల అతి వినియోగం ఈ ఫోమో పెరగడానికి ప్రధాన కారణం అవుతోంది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి వేదికల్లో ఇతరులు పెట్టే ఫోటోలు, వీడియోలు చూసి, వారి జీవితం ఎంతో అద్భుతంగా ఉందనే భ్రమలో యువత మునిగిపోతున్నారు. ప్రతి రోజూ కొత్త విషయాలు, కొత్త ట్రెండ్స్ వస్తున్న తరుణంలో వాటిని అనుసరించలేకపోతున్నామనే భయం యువతను వెంటాడుతోంది.***

యువతలో ఫోమో ప్రభావం అనేక రకాలుగా కనిపిస్తుంది. నిరంతరం స్మార్ట్‌ఫోన్‌లను తనిఖీ చేయడం, ప్రతి నిమిషం నోటిఫికేషన్ల కోసం ఎదురుచూడటం ఒక అలవాటుగా మారుతోంది. దీనివల్ల ఏకాగ్రత దెబ్బతిని చదువులో వెనుకబడిపోయే ప్రమాదం ఉంది. ఇతరుల విహారయాత్రలు, పార్టీలు లేదా కొనుగోలు చేసిన ఖరీదైన వస్తువులను చూసినప్పుడు, తమ వద్ద అవి లేవనే అసంతృప్తి వారిలో మొదలవుతుంది. ఈ అసంతృప్తి క్రమంగా తక్కువ అంచనా వేసుకోవడానికి, మానసిక ఒత్తిడికి దారితీస్తోంది. తాము కూడా ఏదో ఒకటి సాధించాలి లేదా అందరిలా కనిపించాలని అనవసరమైన పోటీకి దారితీసి, ఆర్థిక ఇబ్బందులకు కూడా గురవుతున్నారు. ఇతరులను అనుకరించే క్రమంలో తమ సొంత వ్యక్తిత్వాన్ని కోల్పోయే అవకాశం ఉంది. ఒకరి ఆహారపు అలవాట్లు, దుస్తులు, ప్రయాణాలు చూసి వాటిని తమ జీవితంతో పోల్చుకోవడం వల్ల కలిగే మానసిక వ్యధ వర్ణనాతీతం.

ఈ మానసిక పరిస్థితి వల్ల నిద్రలేమి సమస్యలు తలెత్తుతున్నాయి. అర్ధరాత్రి వరకు సోషల్ మీడియాలో గడపడం వల్ల శారీరక ఆరోగ్యం దెబ్బతింటోంది. కేవలం వర్చువల్ ప్రపంచంలోనే గుర్తింపు కోసం ప్రయత్నించడం వల్ల నిజ జీవితంలోని బంధుత్వాలు, స్నేహాలు మరుగున పడిపోతున్నాయి. పక్కనే ఉన్న వారితో మాట్లాడటం మానేసి, ఎక్కడో ఉన్న వారి స్పందన కోసం





ఆరాటపడటం విచారకరం. సమాజంలో తాము ఒంటరి అయిపోతామేమో అనే భయం వారిని నిరంతరం వేధిస్తూ ఉంటుంది. ఏదైనా ఒక ట్రెండ్‌లో భాగం కాకపోతే తాము వెనుకబడిపోయామని భావించడం వల్ల నిర్ణయాలు తీసుకునే శక్తి కూడా తగ్గిపోతుంది. చిన్న విషయాలకు కూడా అతిగా స్పందించడం, అసూయ చెందడం వంటి ప్రతికూల భావాలు పెరుగుతున్నాయి. ఆన్‌లైన్‌లో ఇతరుల కృత్రిమ సంతోషాన్ని చూసి నిజమైన ఆనందాన్ని కోల్పోతున్నారు.

ఫోమో నుండి బయటపడటానికి యువత కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం అత్యవసరం. ముందుగా సోషల్ మీడియా వినియోగాన్ని పరిమితం చేసుకోవాలి. తెరపై కనిపించేవన్నీ నిజం కాదని, ప్రతి ఒక్కరి జీవితంలోనూ సమస్యలు ఉంటాయని గ్రహించాలి. ఇతరులతో పోల్చుకోవడం మానేసి, తమ వద్ద ఉన్న వాటికి కృతజ్ఞతతో ఉండటం అలవాటు చేసుకోవాలి. దీన్నే 'జోమో' (జాయ్ ఆఫ్ మిస్సింగ్ అవుట్) అని కూడా అంటారు. అంటే అనవసరమైన విషయాల్లో భాగం కానందుకు సంతోషించడం. దీనివల్ల మనశ్శాంతి లభిస్తుంది. ధ్యానం చేయడం, పుస్తక పఠనం, వ్యాయామం వంటి అలవాట్లపై దృష్టి సారించడం వల్ల మనస్సు అదుపులో ఉంటుంది. నిజ జీవితంలో స్నేహితులతో సమయం గడపడం, ప్రకృతితో మమేకం కావడం వల్ల మానసిక స్థితి మెరుగుపడుతుంది. డిజిటల్ డిటాక్స్ అంటే కొంతకాలం సాంకేతికతకు దూరంగా ఉండటం కూడా ఎంతో మేలు చేస్తుంది.

యువత తమ లక్ష్యాల పట్ల స్పష్టత కలిగి ఉండాలి. ఇతరుల జీవితాలను చూసి ఆందోళన చెందడం కంటే, తమ భవిష్యత్తును ఎలా తీర్చిదిద్దుకోవాలో ఆలోచించాలి. ప్రతి క్షణాన్ని ఆస్వాదించడం నేర్చుకోవాలి. ప్రస్తుతం ఉన్న స్థితిని గౌరవిస్తూ, తమ ఎదుగుదలపై దృష్టి పెట్టినప్పుడు ఫోమో వంటి సమస్యలు దరిచేరవు. సాంకేతికతను సమాచారం కోసం వాడుకోవాలే తప్ప, అది జీవితాన్ని శాసించకుండా చూసుకోవాలి. తల్లిదండ్రులు కూడా పిల్లలతో సమయం గడుపుతూ, వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపాలి. ఈ విధంగా అవగాహన పెంచుకోవడం ద్వారా యువత ఫోమో బారి నుండి తప్పించుకుని ఆరోగ్యకరమైన, సంతోషకరమైన జీవితాన్ని గడపవచ్చు. బాహ్య ప్రపంచపు ఆకర్షణల కంటే అంతర్గత ప్రశాంతత మిన్న అని గుర్తించడమే దీనికి అసలైన పరిష్కారం. స్వీయ నియంత్రణ, ఆత్మవిశ్వాసం కలిగిన యువత మాత్రమే ఈ ఆధునిక మానసిక సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోగలరు. ప్రశాంతమైన జీవనం కోసం అనవసరమైన పోటీలను వదిలిపెట్టి, తమ సొంత మార్గాన్ని నిర్మించుకోవాలి.

# చెత్త రహిత పాలనకు ప్రజలు అందరూ సహకారం అందించాలి






**- మన విశాఖ ను మనమే దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దాలి**

**- విద్యార్థులు అందరూ పర్యావరణ హితంగా జీవించాలి**

**- శృతి శ్రీ, విశాఖ జిల్లా ఐఇసి కోఆర్డినేటర్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్**

**విశాఖపట్నం (జయ జయహే)**

చెత్త రహిత పాలనకు ప్రజలు అందరూ సహకారం అందించాలి అని స్వచ్చాంధ్ర కార్పొరేషన్ విశాఖపట్నం జిల్లా ఐఇసి కోఆర్డినేటర్ శృతి శ్రీ పిలుపునిచ్చారు. ఎం విపి కాలనీలో సెవెంత్ డె అడ్వెంటిస్ట్ విద్యా సంస్థలో సోమవారం ఉదయం ప్రిన్సిపాల్ నవీన్ కుమార్ అధ్యక్షతన గ్రీన్ క్లైమేట్ టీం, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ల నేతృత్వంలో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర లో భాగంగా "చెత్త రహిత పరిపాలన" (జీరో వేస్ట్ లిట్టర్ గవర్నెన్స్) కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మన దేశానికి ఆదర్శంగా విశాఖను తీర్చిదిద్దాలని కోరారు. విద్యార్థులు అందరూ పర్యావరణ హితంగా జీవించాలని కోరుతూ అవగాహన కల్పించారు. మేధావులు సహకారం అందించాలన్నారు. విద్యార్థులు, మహిళలు, నగరవాసులు అందరూ చెత్త రహిత నగరంగా విశాఖ మహానగరాన్ని తీర్చి దిద్దడానికి కంకణబద్ధులై జీవించాలని కోరారు. మన అందమైన నగరాన్ని ఒక సుందరమైన విధంగా తీర్చి దిద్దాలని కోరారు. వంటింటి వ్యర్థాలతో ఎరువు తయారు చేసి ఎవరి ఇంటి వద్ద వారె కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు పండించడం అవసరం అని వివరించారు. సమస్త జీవరాశి నీ కాపాడుకోవాలి అని వివరించారు. ప్రతి విద్యార్థి ఒక హరిత సైనికులు గా మారాలి అని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరమ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కో కన్వీనర్ విశాలాక్షి, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం, గ్రీన్ వాలంటీర్ జె రాజేశ్వరి, హెడ్ మాస్టర్ జాస్లిన్ నవీన్ విప్పర్తి తదితరులు పాల్గొని మాట్లాడారు



## దివ్యాంగుల బ్యాక్లాగ్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలి

**వైసీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు పోసి కుమార్**

**రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:**

తూర్పుగోదావరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దివ్యాంగుల విభాగం నాయకులు పలు కీలక డిమాండ్లతో వినతి పత్రాన్ని అందజేశారు. జిల్లా దివ్యాంగుల విభాగం అధ్యక్షులు ముత్యాల పోసి కుమార్ ఆధ్వర్యంలో ఈ వినతి పత్రాన్ని జిల్లా డీఆర్వో సీతారామ మూర్తికి సమర్పించారు. ఈ సందర్భంగా ముత్యాల పోసి కుమార్ మాట్లాడుతూ, దివ్యాంగులకు సంబంధించిన బ్యాక్లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ప్రధానంగా డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన రిజర్వేషన్ల ప్రకారం ఖాళీగా ఉన్న ఉద్యోగాలను త్వరితగతిన నింపాలని కోరారు. అలాగే ప్రతి నియోజకవర్గానికి 25 చొప్పున మొత్తం 4375 మంది లబ్ధిదారులను గుర్తించి, మూడు చక్రాల మోటార్ సైకిళ్లను వెంటనే అందజేయాలని విజ్ఞప్తి చేశారు. దివ్యాంగులకు డ్రైవింగ్ లైసెన్సుల విషయంలో ప్రత్యేక మేళాలు నిర్వహించి, చలానా రూ.260 మరియు లైసెన్సు ఫీజు రూ.770 కలిపి మొత్తం రూ.1030ను ప్రభుత్వమే భరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా 'ఇంద్రధనస్సు'లో ప్రకటించిన ఏడు వరాలను తక్షణమే అమలు చేసి, ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని దివ్యాంగులకు వెంటనే కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ వినతి పత్రం రాష్ట్ర దివ్యాంగుల విభాగం అధ్యక్షులు పులిపాటి దుర్గా రెడ్డి ఆదేశాల మేరకు, అలాగే జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెల్లిబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ సూచనల మేరకు సమర్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా దివ్యాంగుల విభాగం ఉపాధ్యక్షులు ఆదం పకీర్ పాల్గొన్నారు.



## ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రం బందోబస్తు

**కొయ్యూరు : (జయ జయహే )న్యూస్ ఫిబ్రవరి 24**

అల్లూరి జిల్లా కాకరపాడు గురుకుల జూనియర్ కళాశాల లో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు సందర్భంగా కొయ్యూరు సిఐ శ్రీనివాస్ కాకరపాడు కళాశాలను సంద్రశించారు.భద్రతా ఏర్పాట్లు పరిశీలించి, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు సజావుగా జరిగేటట్లు తగిన బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.కళాశాల లో ఇంటర్ మొదటి సంవత్సరం 190 మంది, ద్వితీయ సంవత్సరం 157 మంది పరీక్షలు రాయనున్నట్లు ప్రిన్సిపాల్ లక్ష్మనుడు తెలిపారు.కొయ్యూరు ఎస్ఐ కిషోర్ వర్మ మాట్లాడుతూ పరీక్ష సమయం లో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

## పారా సెట్టింగ్ వాలీబాల్ నేషనల్స్ టోర్నమెంట్‌కు సెలెక్ట్ అయిన బుచ్చయ్యపేట యువకుడు

**బుచ్చయ్యపేట జయ జయహే**




ఈనెల ఫిబ్రవరి 25 నుండి 28 వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం మీరట్ జరుగుతున్న 14 సీనియర్ పారా సెట్టింగ్ వాలీబాల్ నేషనల్స్ టోర్నమెంట్ కి అనకాపల్లి జిల్లా నుండి ఆంధ్రప్రదేశ్ టీం కి బుచ్చయ్య పేట గ్రామానికి చెందిన గాడి సురేష్ అనే యువకుడు ఎంపికయ్యాడు. ఈ టోర్నమెంట్ కి ఎంపిక కావడంతో గ్రామం లో సురేష్ ను పలువురు నాయకులు, యువకులు అభినందించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ ఈ అవకాశం కల్పించిన పారా వాలీబాల్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ప్రెసిడెంట్ బోడపాటి శివధత్ అసోసియేషన్ మెంబర్స్ కి సురేష్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని సురేష్ తెలిపారు.




## అరకు వేలిలో అంగన్వాడి ఐసిడిఎస్ వద్ద... సిఐటియు ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష

**అరకులోయ: జయ జయహే.**

అంగన్వాడి వ్యవస్థ పటిష్టం చేయాలని 42 రోజులపాటు రిలే నిరాహార దీక్ష నిర్వహిస్తున్న సందర్భంగా ప్రతిపక్ష నాయకుడిగా ప్రస్తుత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దీక్ష శిబిరానికి వచ్చి ఇచ్చిన హామీ అమలు చేయాలని రాష్ట్రవ్యాప్తంగా 23 ,24 ,తేదీల్లో నిరసన దీక్షలు జరుగుతున్నాయి. అధికారం చేపట్టి రెండు సంవత్సరాలు గడుస్తున్న ప్రతిపక్ష హోదాలో ఇచ్చిన హామీ అధికారంలో వచ్చిన తర్వాత మర్చిపోయిన పరిస్థితి కనిపిస్తుంది. పెరిగిన ధరలకు అనుగుణంగా అంగన్వాడి వేతనాలు పెంచాలని మినీ సెంటర్ లను మెయిన్ సెంటర్ లు గా మార్చాలని సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు మండల కార్యదర్శి జన్ని భగత్ రామ్ మాట్లాడుతూ, అంగన్వాడి వ్యవస్థ పటిష్టం చేయాలని అనేక పోరాటాలు నిర్వహిస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎత్తినట్లు వ్యవహరిస్తూ అంగన్వాడి వ్యవస్థను నిర్లక్ష్యం చేస్తుంది. అంగన్వాడి టీచర్లు వెల్పర్లు తమ జీవితాంతం పనిచేస్తున్న కనీస వేతనాలు అమలు చేయకుండా పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు పెంచకుండా తీవ్ర నిర్లక్ష్యం చేస్తుంది. ఏజేన్సీ లో అద్దె భవనాలకు అంగన్వాడి సెంటర్లు నిర్వహిస్తున్నారు . కట్టెలు బిల్లులు గ్యాస్ బిల్లులు ప్రభుత్వం సకాలంలో చెల్లించడం లేదు ఈవిధ రకరకాల యాప్ పెట్టి సమాచారం ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నారు. మారముల ప్రాంతాల్లో యాప్ సమస్య రోజురోజుకి పెరుగుతుంది. రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇతర ఏ సౌకర్యాలు లేకపోయినా అనేక సమస్యలు తట్టుకొని అంగన్వాడి వ్యవస్థ కొనసాగిస్తున్నారు. పర్మినెంట్ ఉద్యోగులకు వర్తించే అన్ని రకాల సౌకర్యాలు అంగన్వాడీలకు వర్తించడం లేదు ధరలకు అనుగుణంగా జీతాలు లేకుండా అన్ని రకాల బెనిఫిట్స్ వర్తించకుండా ప్రభుత్వ పథకాలు ఆపివేయడం ద్వారా అంగన్వాడీలు నష్టపోతున్నారు. ప్రతిపక్ష ఇచ్చిన హామీ తక్షణమే అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత డిమాండ్లు పరిష్కారం చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేయడం జరిగింది .ఈ కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ ప్రెసిడెంట్ దురియ నిర్మల, కొర్ర లక్ష్మి,పి.గౌరమ్మ,కె.సీత,టి.గౌరమ్మ,బి.భగ్యలక్ష్మి,పి.లలితకుమారి,ఎస్.నాగమ్మ , ఎస్.శారధ, తదితరులు పాల్గొన్నారు.




## కిమ్స్ ఆసుపత్రిలో అనూరియా రోగుల పరిస్థితి పరిశీలించిన కలెక్టర్

**ఐదుగురి ఆరోగ్యం స్థిరం - ఇద్దరు వెంటిలేటర్‌పై చికిత్స**

**రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:**

రాజమహేంద్రవరం నగరంలో నమోదైన అనూరియా కేసుల నేపథ్యంలో కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగుల ఆరోగ్య పరిస్థితిని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి సోమవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ కూడా ఆమెతో కలిసి ఆసుపత్రిని సందర్శించారు.ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఏడుగురు రోగుల ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ప్రతి రోగికి అత్యుత్తమ వైద్య సదుపాయాలు అందేలా చూడాలని, అవసరమైన మందులు, పరికరాలు, నిపుణుల సేవలు అందుబాటులో ఉంచాలని వైద్య సిబ్బందికి ఆదేశించారు.వైద్యుల వివరాల ప్రకారం చికిత్స పొందుతున్న ఏడుగురిలో ఐదుగురి ఆరోగ్యం ప్రస్తుతం స్థిరంగా ఉంది. మరో ఇద్దరికి వెంటిలేటర్‌పై ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. రోగుల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన అన్ని వైద్య చర్యలు తీసుకుంటున్నామని వైద్యులు కలెక్టర్‌కు వివరించారు.ఈ అంశంపై రాష్ట్ర ముఖ్యమంత్రి స్థాయిలో కూడా సమీక్ష కొనసాగుతోందని అధికారులు వెల్లడించారు. జిల్లా యంత్రాంగం పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ, క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహిస్తోందని కలెక్టర్ స్పష్టం చేశారు.అనంతరం రోగుల బంధువులతో మాట్లాడిన కలెక్టర్ కీర్తి చేకూరి వారికి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం తరఫున అవసరమైన పూర్తి సహకారం అందిస్తామని, మెరుగైన చికిత్సకు ఎటువంటి లోటు ఉండదని భరోసా ఇచ్చారు. ఈ పరిశీలనలో జిల్లా ఎన్టీఆర్ వైద్య సేవా సమన్వయ కర్త పి. ప్రియాంకతో పాటు ఇతర వైద్య అధికారులు పాల్గొన్నారు.



## ఎర్రం నాయుడు ఆశయాలు కొనసాగిస్తాం

**మాజీమంత్రి ఎర్రన్న జయంతి నివాళులు**

**టెక్కలి ఫిబ్రవరి 23 జయ జయహే**

శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాలి మండలం నిమ్మడ గ్రామంలో మాజీ కేంద్రమంత్రి కింజరాపు ఎర్రం నాయుడు ఘాట్ వద్ద కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు సారధ్యంలో ఎర్రన్న 69 జయంతి నివాళులు కుటుంబ సభ్యులు, అభిమానులు కార్యకర్తలు నిర్వహించారు. ప్రజా శ్రేయస్సు కోసం ఎర్రన్న చేసిన సేవలు మరువలేమని ఆయన ఆశయ సాధన కోసం పనిచేస్తామని పలువురు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తోపాటు మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు కింజరాపు హరి వరప్రసాద్, ఎన్ఫోర్స్మెంట్ ఓఎస్డి కింజరాపు ప్రభాకర్, జిల్లా తెలుగు యువత అధ్యక్షులు మెండ దాస్ నాయుడు, కుటుంబ సభ్యులు, అభిమానులు , కార్యకర్తలు, గ్రామస్తులు, పాల్గొన్నారు.

## విశాఖ మేజిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరల్డ్ మేజిక్ డే



**విశాఖపట్నం జయ జయహే**

విశాఖ మేజిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరల్డ్ మేజిక్ డే సందర్భంగా విశాఖపట్నం పౌర గ్రంథాయాలంలో మేజిక్ పితామహుడు డా.పద్మశ్రీ షార్కర్ కు ఘన నివాళులు అరిపించి కార్యక్రమంను ఘనంగా ప్రారంభించేరు. మేజిక్ అభిమానులు అందరు అధికంగా విచ్చేసేరు .కార్యక్రమంలో మేజిక్ కళాకారులు పాల్గొని అహుతులను ఆశ్చర్యపరిచే మేజిక్లు చేసి ఆనందపరిచేరు. మరి ముఖ్యంగా సుమారు 80 సంవత్సరాల వయసు లో కూడ సి. హెచ్ పారశురాం అద్భుతమైన మేజిక్ చేసి అహుతులను ఆకట్టుకున్నారు. పరుశురాం ఫైర్ బుక్ ను తన సొంతంగా తరాయరు చేసి ఎంతో మంది మెజీషియన్కు అందించి ప్రోతహించారు అని మెజీషియన్ తెలియజేసారు. విశాఖ మేజిక్ అసోసియేషన్ అధ్యక్షులు మెజీషియన్ జి. వి సురేష్ మేజిక్ చేసి అందరిని ఆశ్చర్యపరిచి కార్యక్రమాని ముగించేరు.

For a pure tomorrow.. జయహే

## పొరపాట్లకు తావులేకుండా

# పదో తరగతి పబ్లిక్ పరీక్షలు

## సమీక్షలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్

**విశాఖపట్నం, ఫిబ్రవరి 23, జయ జయహే**




మార్చిలో నిర్వహించనున్న ఎస్ఎస్‌సీ పబ్లిక్ పరీక్షలను అత్యంత పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, పరీక్షల నిర్వహణలో చిన్న పొరపాటుకు కూడా అవకాశం లేకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. పరీక్షలు మార్చి 16 నుంచి ఏప్రిల్ 01వ తేదీ వరకు ఉదయం 9.30 నుంచి 12.45 గంటల వరకు నిర్వహించనున్న నేపథ్యంలో, జిల్లాలో ఏర్పాటు చేసిన 133 పరీక్ష కేంద్రాలలో మౌలిక వసతులు, తాగునీరు, విద్యుత్ సరఫరా, ఫర్నిచర్ తదితర ఏర్పాట్లు ముందుగానే పూర్తిచేయాలని సూచించారు. ప్రతి కేంద్రం వద్దా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. పర్యవేక్షణకు నియమించిన ఫ్లయింగ్ స్క్వాడ్లు, సిట్టింగ్ స్క్వాడ్లు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేసి నకిలీ, అక్రమాలకు తావులేకుండా చూడాలని ఆదేశించారు. అన్ని పరీక్ష కేంద్రాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రశ్నాపత్రాల భద్రత, సమాధాన పత్రాల సురక్షిత తరలింపుపై ప్రత్యేక దృష్టి సారించాలని, పోలీస్, రెవెన్యూ, విద్యాశాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులకు అనుకూల వాతావరణం కల్పించేందుకు పరీక్ష కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ అమలు చేయాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇదిలా ఉండగా పరీక్షలకు మొత్తం 30,633 మంది విద్యార్థులు హాజరవుతున్నారని పేర్కొన్నారు.

**ఓపెన్ స్కూల్ పరీక్షల నిర్వహణకూ పక్కా ఏర్పాట్లు...!**

ఇంటర్మీడియట్, ఎస్సెస్సీ పబ్లిక్ పరీక్షలతో పాటు ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే పదోతరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు కూడా పక్కా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి 02 నుంచి 13వ తేదీ వరకు ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు జరగనున్నాయని, ఈ పరీక్షలకు మొత్తం 1,247 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని కలెక్టర్ తెలిపారు. ఇందుకోసం 16 ప్రాథమిక కేంద్రాలు, 6 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అలాగే ఎస్సెస్సీ ఓపెన్ స్కూల్ పబ్లిక్ పరీక్షలు మార్చి 16 నుంచి 28వ తేదీ వరకు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలకు జిల్లాలో మొత్తం 1,141 మంది విద్యార్థులు హాజరుకానున్నారని, ఇందుకోసం 16 ప్రాథమిక సెంటర్లు, 11 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. పరీక్షల నిర్వహణకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా పక్కా ఏర్పాట్లు చేయాలని, సంబంధిత శాఖల అధికారులకు జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాలు, భద్రత, మౌలిక సదుపాయాలు, ఇన్విజిలేషన్ వ్యవస్థ పటిష్టంగా ఉండాలని సూచించారు. పరీక్షలు ప్రశాంతంగా, నిబంధనల ప్రకారం నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఇన్చార్జి డీఆర్వో సత్తిబాబు, ఏడీసీపీ అడ్మిన్ రాజ్ కమల్, జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్. ప్రేమ్ కుమార్, డీఎం హెచ్వో జగదీశ్వరరావు, విద్యుత్ శాఖ ఈఈ లక్ష్మణరావు, ఐ&పీఆర్ డీడీ సదారావు, ట్రెజరీ, పోస్టాఫీసు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



## 27న చలో ఐటిడిఏ

# జయప్రదం చేయండి

## ఆదివాసీ గిరిజన సంఘం

**అరకులోయ: జయ జయహే.**

పిఎం జన్మన్ హౌసింగ్ లబ్ధిదారులకు బకాయి బిల్లులు చెల్లించాలని రాష్ట్రప్రభుత్వం పెంచిన లక్ష రూపాయలు వెంటనే జమ చేయాలని అరకులోయ మండలం చినలబుడు పంచాయితీ గొందివలస గ్రామంలో ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 27 న చలో ఐటిడిఏ పాడేరు కార్యక్రమం విజయవంతం చేయాలని కరపత్రాలు పంపిణీ చేశారు.ఆదివాసి గిరిజన సంఘం మండల నాయకులు తుడుం క్లస్టర్ పెసా కార్యదర్శి ముసిరి మల్లన్న మాట్లాడుతూ పివిటిజి లకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పీఎం జన్మన్ హౌసింగ్ ఇల్లులు మంజూరు చేసిందని ఇల్లులు నిర్మించుకున్న వారికి బిల్లులు సకాలంలో చెల్లించడం లేదని రాష్ట్ర ప్రభుత్వం పీవీటీజీలకు లక్ష రూపాయలు పెంచినట్లు ప్రకటించి సంవత్సరం గడుస్తున్నా నేటికీ లబ్ధిదారుల ఖాతాలో జమ కాలేదని గ్రామీణ ఉపాధి హామీ ద్వారా ఇవ్వాల్సిన 29 వేలు ఇవ్వాలని పిఎం జన్మన్ పీవీటీజీ గ్రామాలకు 12 రకాల అభివృద్ధి పనులు పూర్తి చేయాలని పిఎం జన్మన్ ఇల్లులకు 10 లక్షలు యూనిట్ ధర పెంచాలని 2.0 సర్వే చేసిన ఆదివాసులకు ఇల్లులు మంజూరు చేసి నిర్మాణం ప్రారంభించాలని ఈ నెల 27 న పిఎం జన్మన్ లబ్ధిదారులు ఆదివాసులు పాడేరు ఐటీడీఏ కార్యాలయం వద్ద ధర్నా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కొర్ర. సుబ్బారావు, కొర్ర .రాజు, గెమ్మెలి .బుజ్జి బాబు, ముసిరి ముసిరి.అప్పన్న పాల్గొన్నారు.



# అరకులో ఘనంగా ఎల్లారమ్మ తల్లి పండుగ వేడుకలు

**అరకులోయ: జయ జయహే.**

అరకులోయ మండల కేంద్రంలోని శ్రీశ్రీశ్రీ ఎలారమ్మ తల్లి పండుగ ప్రారంభమైంది మూడు రోజులపాటు ఘనంగా జరుగునున్న అమ్మవారి ఉత్సవాలు ఆదివారం నుండి మూడు రోజులపాటు వైభవ పేతంగా ప్రారంభం ఆలయం వద్ద భక్తురాలు శాంతమ్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు తొల్లెలు పండగ ఘనంగా జరిగింది ఈ సందర్భంగా భక్తురాలు శాంతమ్మ మాట్లాడుతూ అమ్మవారి పండగను ప్రతి ఏటగనంగా నిర్వహిస్తున్నామని. ఈ ఏడాది కూడా శ్రీ ఎల్లారమ్మ తల్లి పండగను మూడు రోజులపాటు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పండుగలో భాగంగా రెండు రోజు సోమవారం నాడు అమ్మవారి సంబరం ఘటాల ఊరేగింపు అన్న సమారాధన కార్యక్రమం ఉంటాయని మూడు రోజులు అణుపు కార్యక్రమం వైభవంగా జరుగుతుందని భక్తురాలు శాంతమ్మ తెలియజేశారు. శ్రీ ఎల్లారమ్మ తల్లి అమ్మవారి ఉత్సవాల్లో భక్తుల అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆమె కోరారు. కాగా మూడు రోజులు పాటు ఘనంగా జరిగే అమ్మవారి ఉత్సవాల్లో అల్లూరి సీతారామరాజు జిల్లా నలుమూలల నుండే కాకుండా మైదాన ప్రాంతాల నుండి కూడా భక్తులు అధిక సంఖ్యలో అరకులోకి చేరుకొని అమ్మవారిని దర్శించుకోవడం అనవాయితీగా మారింది.



# ఇంటర్మీడియట్ పరీక్షల కేంద్ర్రాలను తనిఖీలు నిర్వహించిన డి.ఎస్.పి అభిషేక్

**జయ జయహే.**

అరకు వేలి మండల పరిధిగల ఇంటర్మీడియట్ పరీక్షల కేంద్రాలను తనిఖీలు నిర్వహించిన డి.ఎస్.పి అభిషేక్ అరకు సీఐ ఎల్ హిమగిరి అరకు వేలి ఎస్సై జి గోపాల్ రావు ఇంటర్మీడియట్ పరీక్షలు సోమవారం నుండి జరుగుతున్నందున ప్రజలకు కొన్ని ముఖ్య సూచనలు తెలియజేశారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో ప్రజలు గుంపులుగా నిలబడరాదు. పరీక్ష సమయంలో లౌడ్ స్పీకర్లు డిజెలు శబ్ద కాలుష్యం కలిగించే కార్యక్రమాలు స్టేజ్ ప్రోగ్రామ్స్ నిర్వహించబడదు. పరీక్ష కేంద్రాల వద్ద వాహనాలను అనవసరంగా నిలిపివేయకండి ట్రాఫిక్ అంతర్యం కలగకుండా సహకరించండి జెరాక్స్ ఫోటో కాఫీ దుగణాలు పరీక్ష సమయంలో మూసి వేయవలెను. ఎవరైనా అనుమానస్పదా వ్యక్తులు లేదా చర్యలు గమనిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇవ్వండి. సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు ప్రశ్నపత్రల లింకు రూమర్లు చేసినట్లు అయితే ఇది చట్టపరమైన చర్యలకు దారితీస్తుంది. పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ వారు బందోబస్తు గస్తీ నిర్వహించు పడుతుంది. కావున ప్రజలు గమనించ వలసిందిగా తెలియజేశారు.




# అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

## టెక్కలి ప్రాజెక్ట్ ఆఫీస్ ముందు నిరాహార దీక్ష లు

**టెక్కలి ఫిబ్రవరి 23 జయ జయహే**

అంగన్వాడి లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వారికిచ్చే కనీస వేతనం , 26వేల రూపాయలు చెల్లించి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని టెక్కలి ఐసిడిఎస్ కార్యాలయం ముందు అంగన్వాడి ల యూనియన్ సి ఐ టి యు పిలుపుమేరకు నిరాహార దీక్ష సోమవారం నిర్వహించారు. ప్రభుత్వశీ తక్షణమే లేబర్ కోడ్లు రద్దు చేయాలని కార్యకర్తలంతా నినాదాలు చేశారు, ఈ సందర్భంగా సిఐటియు నాయకులు నంబూరు షణ్ముఖరావు మాట్లాడుతూ ప్రభుత్వం కార్మిక కష్టజీవులకు వ్యతిరేకంగా పనిచేస్తుందని, దోపిడీ వర్గాల కు అనుకూలంగా ఉండి కార్మికుల హక్కులను కాలరాయడం తగదని షణ్ముఖరావు తెలిపారు. ప్రజా పోరాటాల ద్వారానే హక్కులు సాధించుకోవాలని, నిర్బంధాలను అధిగమించి ఐక్యమత్యంతో ఉద్యమించాలని రైతు సంఘం ప్రతినిధి కొల్లి ఎల్లయ్య డిమాండ్ చేశారు. తమ హక్కులు సాధించేవరకు నిరంతరంగా దీక్ష కార్యక్రమాలు జరుగుతాయని అంగన్వాడి సంఘం అధ్యక్షురాలు ఆదిలక్ష్మి రవణమ్మలు తెలిపారు. ఈ దీక్ష కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు నిర్మల, అరుణ, దమయంతి, పద్మ, కృష్ణవేణి, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.




# మార్చి 25న ఆంధ్ర విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం

## ఏ యూ రిజిస్ట్రార్ కె.రాంబాబు

ఏ యూ క్యాంపస్, ఫిబ్రవరి 23, జయ జయహే : ఆంధ్ర విశ్వవిద్యాలయం 91,92 సంయుక్త స్నాతకోత్సవం మార్చి 25న నిర్వహించనున్నట్లు ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య కె. రాంబాబు సోమవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఆరోజు ఉదయం 11 గంటలకు బీచ్ రోడ్ లోని ఏయు కన్వెన్షన్ సెంటర్ వేదికగా ఈ స్నాతకోత్సవం జరుగుతుంది. గతంలో దరఖాస్తు చేసిన వారందరూ ఈ స్నాతకోత్సవంలో పట్టాలను అందుకోనున్నారు. స్నాతకోత్సవ పట్టాలను స్వీకరించేవారు ఉదయం 10 గంటలకు ప్రాంగణానికి చేరుకుని తమకు కేటాయించిన స్థానంలో ఆసీనులు కావాలని సూచించారు. కార్యక్రమం పూర్తయిన తరువాత విశ్వవిద్యాలయ చాన్సలర్, ముఖ్య అతిథి తదితరులు వెళ్లే వరకు వీరంతా తమ కేటాయించిన స్థానాల్లో ఉండాలని సూచించారు.

# లోకోమోటివ్‌లకు ఆకర్షణీయ రంగులు

## వాల్తేరు రైల్వేకి అదనపు ఆదాయం

**విశాఖపట్నం, ఫిబ్రవరి 23, జయ జయహే**




ఈస్ట్ కోస్ట్ రైల్వేలోని వాల్టెయిర్ డివిజన్ అదనపు ఆదాయ వనరులు సమకూర్చుకునే దిశగా అడుగులు వేస్తుంది. 2028 వరకు మూడు సంవత్సరాల కాలానికి ఇ-వేలం ప్రక్రియ ద్వారా ఢిల్లీకి చెందిన క్యాటరింగ్, హాస్పిటాలిటీ సర్వీసెస్ కాంట్రాక్టర్‌కు పది ఎలక్ట్రిక్ లోకోమోటివ్‌లపై వాణిజ్య ప్రకటన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. వినూత్నమైన నాన్-ఛార్జ్ ఆదాయ ఉత్పత్తి వైపు ఒక ముఖ్యమైన అడుగు వేసింది. ఈ చొరవతో, లోకోమోటివ్‌లను కంపెనీ ఆమోదించిన డిజైన్‌లతో అలంకరించబడతాయి. ఇవి మరింత రంగురంగులవి, ఆకర్షణీయంగా, సౌందర్యపరంగా, ప్రజలకు ఆకర్షణీయంగా ఉంటాయి. ఆమోదించబడిన డ్రాయింగ్‌లకు అనుగుణంగా వాణిజ్య ప్రకటనల కోసం ప్రతి లోకోమోటివ్‌కు సుమారు 38.56 చదరపు మీటర్ల స్థలాన్ని కేటాయించారు. ఈ ఒప్పందం రూ. 7 లక్షల కంటే ఎక్కువ వార్షిక లైసెన్సింగ్ ఫీజును కలిగి ఉంది. మొత్తం కాంట్రాక్ట్ విలువ రూ. 26 లక్షల కంటే ఎక్కువగా ఉంటుంది. తద్వారా డివిజన్ యొక్క నాన్-ఛార్జ్ ఆదాయాలకు గణనీయంగా దోహదం చేస్తుంది. ఈ సందర్భంగా నూతన ఆదాయ మార్గాన్ని అన్వేసించిన బృందాన్ని అభినందిస్తూ, వాల్టెయిర్ డివిజన్ వాణిజ్య, డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రా మాట్లాడుతూ కార్యాచరణ నైపుణ్యం, భద్రతా ప్రమాణాలను కొనసాగిస్తూ రైల్వే ఆస్తులను వినూత్నంగా ఉపయోగించుకోవడమే వాల్టెయిర్ డివిజన్ చొరవ అని అన్నారు. అధిక ఆకర్షణీయ రోలింగ్ స్టాక్ ఆస్తులను డైనమిక్ ప్రకటనల వేదికలుగా మార్చడం ద్వారా, డివిజన్ తన ఆర్థిక స్థిరత్వాన్ని బలోపేతం చేస్తూనే ఉందని, ఛార్జీలు కాని ఆదాయ మార్గాలను పెంచే భారతీయ రైల్వేల విస్తృత దృక్పథానికి అనుగుణంగా ఉందన్నారు.

# యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా సైన్స్ టాలెంట్ టెస్ట్

**శ్రీకాకుళం జిల్లా, కొత్తూరు( జయ జయహే )**

జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ కొత్తూరు మండల శాఖ ఆధ్వర్యంలో మండల స్థాయి టాలెంట్ టెస్ట్ ను, మండల విద్యాశాఖాధికారులు చందక గోవిందరావు, నిమ్మల శ్రీనివాసరావుల పర్యవేక్షణలో విజయవంతంగా నిర్వహించినట్లు సంఘ ప్రతినిధులు తెలిపారు. నివగాం ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయులు జి.రాఘవదాసు సమన్వయంతో క్రమశిక్షణాయుతంగా ఈ పరీక్ష నిర్వహణ జరిగిందని యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్షులు కె.విజయకుమార్, ప్రధాన కార్యదర్శి వాన మధుసూదనరావు, సీనియర్ నేతలు ఆర్.ఆర్.ఎం.కొండలరావు, దండు ప్రకాశరావు, పూర్వ జిల్లా కార్యదర్శి బోడ శ్రీను, జి.మాధవరావు తదితరులు తెలిపారు. మండల పరిధిలో గల వివిధ పాఠశాలల నుండి 192 మంది విద్యార్థులు పాల్గొనగా, ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.



తొలి ఐదు స్థానాల్లో గురివిందల పాఠశాల విద్యార్థి ఎల్.జితేంద్రప్రసాద్, పారాపురం పాఠశాల విద్యార్థిని దూసి జాహ్నవి, ఆర్.ఆర్.గూనభద్ర పాఠశాల విద్యార్థిని పెద్దకోట తన్విశ్రీ, గులివిందులపేట పాఠశాల విద్యార్థిని మురపాక శ్రావ్య, ఆర్.ఆర్.గూనభద్ర పాఠశాల విద్యార్థి పెద్దకోట కార్తికేయలు విజేతలుగా నిలిచి బహుమతులు అతిథుల చేతులమీదుగా స్వీకరించారు. అదనంగా 10వ స్థానం వరకు ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కూడా ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఇదే వేదికపై ప్రతీ స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రత్యేక బహుమతులను అందజేశారు. కొత్తూరు మండల శాఖ యుటిఎఫ్ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని సహకరించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అందరికీ యుటిఎఫ్ కొత్తూరు మండల శాఖ తరపున అధ్యక్ష కార్యదర్శులు కృతజ్ఞతలు తెలియజేశారు.



# సమయాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలి

**జనసేన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు మంత్రి నాదెండ్ల సూచన**

**అమరావతి (జయ జయహే)**

క్షేత్ర స్థాయి ప్రజా సమస్యలను మరింత బలంగా ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేలా జనసేన పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పనిచేయాలని రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సూచించారు. శాసనసభ, మండలిలో జరుగుతున్న తీరు, పార్టీ ప్రజాప్రతినిధులు అడుగుతున్న ప్రశ్నలు, పాల్గొంటున్న చర్చలు, చట్టసభల్లో అనుసరించబోయే వ్యూహం గురించి సోమవారం అసెంబ్లీలోని జనసేన పార్టీ శాసనసభా పక్ష కార్యాలయంలో మనోహర్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో భేటీ అయ్యారు. సామాజిక అంశాలపై అవగాహన పెంచుకోవాలని, ప్రసార మాధ్యమాల్లో మాట్లాడే సమయంలో పూర్తి పరిజ్ఞానంతో మాట్లాడాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ సంక్షేమాన్ని, అభివృద్ధిని ప్రతి ఒక్కరికీ తెలియజేస్తూనే వైసీపీ కులాల మధ్య పెడుతున్న చిచ్చుల కుట్రలను ప్రజలకు అర్థం అయ్యేలా చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. విలువైన చట్టసభల సమయాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకునేలా ముందస్తు ప్రణాళికతో సభకు రావాలని చెప్పారు. ప్రజా సమస్యలను, ప్రాధాన్యత క్రమంలో ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చి, పరిష్కరించేలా చొరవ తీసుకోవాలన్నారు. ఈ నెల 26వ తేదీ నుంచి పార్టీ ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమం మొదలవుతుందని, ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రతి ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే పార్టీ కార్యక్రమాల నిర్వహణకు తగినంత సమయం కేటాయించాలని, కార్యకర్తలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలకి సమాయత్తం కావాల్సిన సమయం వచ్చిందని చెప్పారు.

# పలు జిల్లాల్లో వడగళ్ల వాన

**పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం**

**పంటలకు తీవ్రంగా నష్టంతో రైతుల ఆందోళన**

**జయ జయహే**

తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో సోమవారం అకస్మాత్తుగా వడగళ్లతో కూడిన భారీ వర్షాలు కురిశాయి. వాతావరణం ఒక్కసారిగా మారిపోయి.. వడగళ్లు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ముఖ్యంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా, సిద్దిపేట జిల్లా, నిర్మల్ జిల్లాల్లో వడగళ్ల వర్షం బీభత్సం సృష్టించింది. ఈ వర్షాలతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లగా, విద్యుత్ సరఫరాకి కూడా అంతరాయం కలిగింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని కాళేశ్వరం ప్రాంతంలో వడగళ్ల వాన తీవ్రంగా కురిసింది. భారీ గాలులు, వడగళ్ల కారణంగా పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. విద్యుత్ వైర్లు తెగిపడటంతో స్థానికంగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వడగళ్ల వాన కారణంగా ముఖ్యంగా మిర్చి, పత్తి, ఇతర వాణిజ్య పంటలకు భారీ నష్టం వాటిల్లింది. ఇప్పటికే పెట్టుబడులు పెట్టిన రైతులు ఒక్కసారిగా నష్టపోవడంతో ఆందోళన చెందుతున్నారు. సిద్దిపేట జిల్లాలోని చేర్యాల, కొమురవెల్లి, మద్దూర్, దూల్మిట్ట మండలాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. గాలుల తీవ్రతకు చెట్లు విరిగిపడిన ఘటనలు చోటుచేసుకున్నాయి. అలాగే సిద్దిపేట, దుబ్బాక పట్టణాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. వర్షపు నీటితో పలు రహదారులు జలమయ మయ్యాయి. రోడ్లపై నీరు నిల్వ ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలో కూడా ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. వర్షంతో కొన్ని ప్రాంతాల్లో చెట్లు విరిగిపడటం, విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగడం వంటి సమస్యలు తలెత్తాయి. ఈ వర్షాలతో తెలంగాణలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఇప్పుడిప్పుడే ఎండ తీవ్రత పెరుగుతండగా.. ఒక్కసారిగా వడగళ్ల వాన, ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో ప్రజలకు ఉపశమనం లభించింది. అయితే రైతులకు మాత్రం తీవ్ర నష్టం కలిగింది. వడగళ్ల వాన కారణంగా ముఖ్యంగా మిర్చి, పత్తి, కూరగాయల పంటలు, ఇతర వాణిజ్య పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వడగళ్ల వర్షంతో పంటలు నేలకూలిపోయాయి. అలాగే మరోవైపు ఈదురుగాలుల కారణంగా పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. విద్యుత్ వైర్లు తెగిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అధికారులు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు చర్యలు చేపడుతున్నారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అధికారులు అప్రమత్తమయ్యారు. నష్టాలను అంచనా వేయడానికి సంబంధిత శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేపడుతున్నారు. రైతులకు నష్టం జరిగిన ప్రాంతాల్లో నివేదికలు సేకరిస్తున్నారు.



# కలెక్టరేట్ వద్ద జనతా వారధి

**పాడేరు (జయ జయహే)**

అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు కలెక్టరేట్ వద్ద జనతా వారధి ప్రోగ్రాం ఇంచార్జి గోపాల పాత్రుడు ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ కార్యక్రమం లో జిల్లా బీజేపీ అధ్యక్షురాలు మఠం శాంత కుమారి గ మాట్లాడుతూ..గత వైస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో హిందూ దేవాలయాలపై జరిగిన దాడులు, అంతర్వేది లక్ష్మి నరసింహ స్వామి టెంపుల్ రథం తగలబెట్టిన దురదృష్టకర సంఘటన, అలాగే పలు ప్రాంతాల్లో హిందూ దేవుళ్ల విగ్రహాల ధ్వంసం ఘటనలపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ లేని కారణంగా డి ఆర్ ఓ . అంబేద్కర్ కు వివరిస్తూ వినతిపత్రం అందజేశారు మీ ద్వారా జిల్లా కలెక్టర్ కు తెలియజేయాలని కోరడమైనది.హిందూ మతంపై జరిగిన దాడులను తీవ్రంగా ఖండించారు.జనతా వారధి కార్యక్రమంలో వృద్ధాప్య పెన్షన్లు, వితంతు పెన్షన్లు, ఇళ్ల స్థలాలు, రెవిన్యూ సమస్యలతో వచ్చిన ప్రజలకు అర్జీలు వ్రాసి, వాటిని జిల్లా కలెక్టర్ కు అందించాలని డిఆర్ఓ ను , కోరుతూ త్వరితగతిన పరిష్కరించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మఠం శాంతి కుమార్ జిల్లా ఉపాధ్యక్షులు సత్యవతి జనతా వారధి కో-కన్వీనర్లు, కుదుముల వెంకటరమణ మరియు నదౌలి ఉమామహేష్ మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.



# నూకాంభికా అమ్మవారికి ఏటా పట్టు వస్త్రాలు

**పద్మ శాలీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఈశ్వరరావు**

**విశాఖపట్నం, ఫిబ్రవరి 23, జయ జయహే**

ఉత్తరాంధ్ర ఇలవేల్పు అనకాపల్లి శ్రీ నూకాంభికా అమ్మవారికి ఏటా పట్టు వస్త్రాలు సమర్పించేందుకు ఆలయ ఈవో అనుమతించారని ఏపీ పద్మశాలీ సంక్షేమ సంఘం అనకాపల్లి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దొడ్డి ఈశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారికి మార్చి 3వ తేదీన పట్టు వస్త్రాలు సమర్పించేందుకు అనుమతి ఇవ్వాలంటూ తమ సంఘం చేసిన విజ్ఞప్తికి ఈఓ, ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్, ధర్మకర్తలు ఆమోదం తెలిపారని ప్రకటించారు. ఈ మేరకు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించాలనుకునే సంఘ సభ్యులంతా ఈ సారి అందుకు తగ్గ ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు. అమ్మవారి పండుగను రాష్ట్ర పండుగలా నిర్వహించేందుకు ప్రభుత్వం ఆమోదించిందని వెల్లడించారు. పద్మశాలీలు మాత్రమే కాకుండా చేనేత పరిశ్రమ పెద్దలు కూడా ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర పెద్దలు, ఆలిండియా ఖాదీబోర్డు మాజీ సభ్యులు పొన్నగంటి అప్పారావు, భీమిలి మాజీ ఛైర్‌పర్సన్ కొప్పల ప్రభావతి రమేష్, సింహాచలం ధర్మకర్తల మండలి మాజీ సభ్యులు సూరిశెట్టి సూరిబాబు, ఏపీ పద్మశాలీ సంక్షేమ సంఘం అనకాపల్లి జిల్లా గౌరవ అధ్యక్షులు పంపాన సత్యన్నారాయణ, జిల్లా అధ్యక్షులు తిప్పాన అప్పారావు, అనకాపల్లి అధ్యక్షులు డాక్టర్ గెడ్డం దివ్య తేజ, డాక్టర్ యామిని కుమారి పాల్గొన్నారని తెలిపారు. అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించేవారు పేరు, గోత్రాలు కమిటీ వారికి తెలియజేయాలని ఈశ్వరరావు తెలిపారు.



# జ్ఞాన వైరాగ్యమే భాగవత పరమార్ధం..!

**ఐదో రోజు ప్రవచన యజ్క్షంలో సామవేదం షణ్ముఖ శర్మ**

**విశాఖపట్నం, ఫిబ్రవరి 23, జయ జయహే :**

జ్ఞాన వైరాగ్యమే భాగవత పరమ ప్రయజనమని ప్రవచనవిరించి, వాగ్దేవీ వరపుత్ర సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. ఋషి పీఠం, సత్సంగం, విశాఖపట్నం ఆధ్వర్యాన ఎంవీపీ కాలనీ, ఆరో సెక్టార్, ఎబీసీ పార్కులో 14 రోజుల శ్రీమద్భాగవవ ప్రవచన యజ్ఞం ఐదో రోజైన సోమవారం సాయంత్రం ప్రవచనంలో సప్తమ స్కంధంలోని ప్రహ్లాదుని జ్ఞాన భక్తి విధాన్ని ప్రవచనకర్త వివరించారు. ఏది భద్రం? ఏది ఉత్తమం? అని తండ్రి హిరణ్యకశ్యపుడు అడిగిన అడిగిన ప్రశ్నకు ప్రహ్లాదుడిచ్చిన సమాధానం ప్రవచనకర్త ఆసక్తికరంగా వివరించారు. ప్రహ్లాదుడి మాటలన్నీ ఒకచోట చేర్చి పఠిస్తే అది భాగవత గీత అవుతుందన్నారు. మానవ జన్మకు భగవత్ అభిముఖ భక్తి కావాలన్నారు. శ్రవణం, కీర్తనం, స్మరణం, పాదసేవనం, అర్చనం, వందనం, దాస్యం, సఖ్యం, ఆత్మనివేదనం ఈ తొమ్మిదింటినీ నవవిధ భక్తివిధానాలంటారని ఉపదేశించారు. అందరి క్షేమం కోరేవాడే భగవంతుడు. హరి భక్తి లేని జీవితం వ్యర్థం అని సామవేదం పేర్కొన్నారు. అజ్ఞానం అచ్చుపు చీకటి. విష్ణు జ్ఞానం చేత మాత్రమే అవిద్యను దాటగలమని సామవేదం వివరించారు. మనస్సు కంటే పెద్ద శత్రువు ఎవరు మానవుడికి లేదన్నారు. దాన్ని జయించలేకపోతే అరిషడ్వర్గాలైన కామ,క్రోధ,మోహ,లోభ,మద, మత్సరములతో మనస్సు నిండిపోతుందన్నారు. తండ్రి ఆజ్ఞానుసారం రాక్షసులు తనను ఎన్నిరకాలుగా హింసించినా పరమాత్ముడు సర్వ స్వరూపుడు అని నారాయణ నామరూపాలనే స్మరించడం ప్రహ్లాదుడి జ్ఞానభక్తికి నిదర్శనమన్నారు. తనకు హాని చేసే శత్రువు క్షేమాన్ని కూడా కోరుకోవడమే అసలు భక్తి. ఇదీ భాగవత మూల సూత్రం. అందుకే 12 స్కంధాలున్న శ్రీమద్భాగవతంలోని ఆరో స్కంధంలో గుండెకాయవంటి చోటున ఈ విషయాలను నిక్షిప్తం చేసిన శుకమహర్షి తీరు అద్భుతమన్నారు. ఇంద్రియాలకు అనుభవింపదేదాన్ని ప్రత్యక్షం అంటారు. అర్తో,జిజ్ఞాసు,అర్థార్థి, జ్ఞాన ఈ నాలుగూ చతుర్విధ భక్తి విధానాలని సామవేదం వివరించారు.



# డయల్ యువర్ సీఎండీకి 43 ఫిర్యాదులు

**ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ వెల్లడి**

**విశాఖపట్నం, ఫిబ్రవరి 23, జయ జయహే**

విద్యుత్ వినియోగదారులు సమస్యల సత్వర పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న 'డయల్ యువర్ ఏపీఈపీడీసీఎల్ సీఎండీ' కార్యక్రమానికి 43 ఫిర్యాదులు వచ్చినట్లు సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం ఉదయం నిర్వహించిన డయల్ యువర్ ఏపీఈపీడీసీఎల్ సీఎండీ కార్యక్రమంలో 43 మంది వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను నేరుగా సీఎండీ దృష్టికి తీసుకువచ్చారు. ఇందులో ప్రధానంగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరు, విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడిలో జాప్యం, విద్యుత్ కనెక్షన్ల ఎస్టిమేషన్లు, రూఫ్ టాప్ సోలార్ ఏర్పాటులో ఇబ్బందులు, విద్యుత్ లైన్ల మార్పు, విద్యుత్ బిల్లులు, విద్యుత్ లైన్లు, స్తంభాల మార్పిడి, విద్యుత్ స్తంభాల మధ్య వైర్లు వేలాడుతుండడం, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, తదితర సమస్యలపై ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఈ సందర్భంగా సీఎండీ పృథ్వీతేజ్ మాట్లాడుతూ 'డయల్ యువర్ ఏపీఈపీడీసీఎల్ సీఎండీ' కార్యక్రమం ద్వారా వచ్చిన సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారానే కాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్ 1912 కు కాల్ చేయడం లేదా వాట్సాప్ నంబరు 9493681912 కు చాట్ చేయడం ద్వారా కూడా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ టి.వనజ, సీజీఎంలు వి.విజయలలిత, ఎల్.దైవప్రసాద్, జీఎం ఎం.ఝాన్సీ, తదితరులు పాల్గొన్నారు.

# పని చేయటం ఇష్టం లేకపోతే.. సెలవు పెట్టి వెళ్లిపోండి...!

**టౌన్ ప్లానింగ్ అధికారుల తీరుపై కలెక్టర్ అసహనం**

**- ఘాటు హెచ్చరికతో ప్లానింగ్‌లో గుబులు**

**విశాఖపట్టణం, ఫిబ్రవరి 23, జయ జయహే**



పని చేయటం ఇష్టం లేకపోతే సెలవు పెట్టి వెళ్లిపోండి.. అంతేగానీ ప్రజా సమస్యల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించబోను అని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులను ఘాటుగా హెచ్చరించారు. గత కొన్ని వారాలుగా పీజీఆర్ఎస్ లో వస్తున్న వినతులకు సరైన పరిష్కారం చూపటంలో విఫలమవుతున్న పది మంది అధికారులను సోమవారం కలెక్టరేట్ కు పిలిపించి మాట్లాడారు. రెండేసి సార్లు మెమోలు ఇచ్చినప్పటికీ ఎందుకని పనితీరు మారటం లేదని ప్రశ్నించారు. ప్రజా సమస్యలకు పరిష్కారం చూపటంలో వెనుకబడడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పునరావృతం కానీయొద్దని, పునఃపరిశీలన చేసుకొని జాగ్రత్తగా పని చేయాలని, ప్రజల నుంచి అందే వినతులకు సమగ్ర స్థాయిలో, నాణ్యమైన పరిష్కారం చూపాలని హితవు పలికారు.



### కివీ పండుతో

## ఆరు ఆరోగ్య ప్రయోజనాలు

పండ్లు, కూరగాయలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వాటిలో మన శరీరానికి కావాల్సిన విటమిన్‌లు, ఖనిజాలు, ఫైబర్‌లు పుష్కలంగా ఉంటాయి. ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే పండ్లలో కివీ పండు కూడా ఒకటి. ఈ పండును తరచూ మన డైట్‌లో భాగం చేసుకోవడం ద్వారా చర్మ సంరక్షణ నుంచి వ్యాధినిరోధకత వరకు ఆరు రకాల ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. మరి ఆ ప్రయోనాలేమిటో చూద్దాం..
తరచూ కివీ పండును తింటే..
ఈ ఆరు ఆరోగ్య ప్రయోజనాలు మీ వెంటే..!

**1. నాజూకైన చర్మం**

కివీ పండులో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఈ విటమిన్ సి చర్మాన్ని ఆరోగ్యంగా, నాజూకుగా ఉంచుతుంది. వంద గ్రాముల కివీ పండు తింటే ఒక రోజులో దేహానికి అవసరమైన సి విటమిన్‌లో అధిక శాతం లభిస్తుంది. అంతేగాక కివీ పండులో యాంటీ ఆక్సిడెంట్స్ ఉండి చర్మం పాలిపోకుండా, ముడుతలు పడకుండా కాపాడుతుంది. పచ్చి కివీ ముక్కలు తినడం ద్వారా గానీ, లేదంటే నేరుగా చర్మానికి రాసుకోవడం ద్వారా గానీ ఈ ప్రయోజనాన్ని పొందవచ్చు.

**2. అదుపులోకి బ్లడ్ ప్రెషర్**

ప్రస్తుతం ఈ భూమ్మీద లక్షలాది మంది ప్రజలు అధిక రక్తపోటు సమస్యతో బాధపడుతున్నారు. వారికి కివీ ఫ్రూట్ ఒక వరం లాంటిది. ఎందుకంటే కివీ పండులో పొటాషియం కంటెంట్ పుష్కలంగా ఉంటుంది. ఈ పొటాషియం రక్తపోటును అదుపులో ఉంచడానికి తోడ్పడుతుంది. అంతేగాక రక్తపోటు కారణంగా వచ్చే పక్షవాతం, టైప్-2 డయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

**3. జీర్ణశక్తి పెరుగుదల**

కివీ పండు జీర్ణశక్తికి కూడా బాగా పనిచేస్తుంది. ప్రతి 100 గ్రాముల కివీ పండులో 3 గ్రాముల ఫైబర్ ఉంటుంది. అంతేగాక ప్రతిరోజూ మానవ శరీరానికి అవసరమైన ఫైబర్‌లో 12 శాతం అందుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఈ ఫైబర్‌లు సునాయాసమైన, ఆరోగ్యకరమైన జీర్ణశక్తికి దోహదం చేస్తాయి. కివీ పండులో ఎంజైమ్‌లను కరిగించే ప్రొటీన్ ఉంటుంది. దాంతో ఎంజైమ్‌లు అత్యంత వేగంగా అమైనో ఆసిడ్స్‌గా మారుతాయి.

**4. ఆరోగ్యకరమైన నిద్ర**

కివీ పండులో సెరటోనిన్ వంటి నిద్రకు ఉపకరించే పదార్థాలు ఉన్నాయి. అందువల్ల తరచూ కివీ పండు తినేవారికి హాయిగా నిద్ర పడుతుంది. నిద్రలేమి సమస్యతో బాధపడేవారికి ఈ పండు మంచి మేలు చేస్తుంది. కివీ పండులోని పదార్థాలు సహజసిద్ధమైన నిద్రకు తోడ్పడుతాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

**5. రోగనిరోధక శక్తి పెంపు**

ముందే చెప్పుకున్నట్టుగా సి విటమిన్‌కు కివీ పండు ఒక మంచి వనరుగా ఉంటుంది. ఈ విటమిన్ రోగనిరోధక శక్తిని పెంపొందించడంలో కూడా బాగా పనిచేస్తుంది. దీనిలోని యాంటీ ఆక్సిడెంట్స్ శరీరంలో ఇన్‌ఫ్లమేషన్ క్రమబద్ధీకరణకు తోడ్పడుతాయి. ఫ్రీ రాడికల్స్ వల్ల శరీరానికి నష్టం జరగకుండా కివీ పండ్లు కాపాడుతాయి.

**6. పటిష్టమైన ఎముకలు**

ఎముక పుష్టి ప్రస్తావన వచ్చినప్పుడు మనకు కివీ పండు అనేది అసలు స్ఫురణకే రాదు. కానీ వాస్తవానికి కివీ పండులో ఎముకలను బలోపేతం చేసే ఫోలేట్ ఉంటుంది. ఈ ఫోలేట్ ఎముక నిర్మాణానికి తోడ్పుడుతుంది. ఎముకల గట్టి తనానికి కివీలోని విటమిన్ కే కూడా బాగా ఉపకరిస్తుంది. అందుకే గర్భిణిల డైట్‌లో కివీ పండును చేర్చడం చాలా ముఖ్యం.

# రాగులతో బరువు తగ్గించుకోండిలా?

**రాగులని ఫింగర్ మిల్లెట్స్ అని కూడా ఉన్నారు. ఇందులో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. మిల్లెట్స్ని తీసుకుంటే రక్తంలో చక్కెరస్థాయిలు తగ్గించడం నుంచి బరువు తగ్గడం, గుండె ఆరోగ్యం వరకూ చాలా బెనిఫిట్స్ ఉన్నాయి. రాగులని మొలకెత్తించి తినడం వల్ల ఎన్నో హెల్త్ బెనిఫిట్స్ ఉన్నాయి. ముఖ్యంగా, ఎముకలు, బ్రెయిన్ డెవలప్‌మెంట్‌లో కూడా హెల్ప్ చేస్తాయి. మొలకెత్తిన రాగులని తీసుకుంటే ఇమ్యూనిటీ పెరుగుతుంది. ఎవరైనా మిల్లెట్స్‌ని ఆహారంగా తీసుకుంటే వారికి పోషకాలు లభిస్తాయి.**



**మిల్లెట్స్‌లోని పోషకాలు..**

మిల్లెట్స్‌లో ఎన్నో పోషకాలు ఉంటాయి. ఇందులో ఫైబర్, కాల్షియం, కార్బోహైడ్రేట్స్, విటమిన్స్ వంటి పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. ఇవి ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. ముఖ్యంగా ఎండాకాలంలో రాగులు తినడం మంచిది. వీటిలోని శీతలీకరణ గుణం వేసవి తాపాన్ని చల్లబరుస్తుంది. అలాగే ఇది షుగర్ ఉన్నవారికి బెస్ట్ ఫుడ్. దీని వల్ల రక్తంలో చక్కెరని కంట్రోల్ చేయడం సాధ్యమవుతుంది.

**రాగి జావ స్పెషల్**

**బ్లడ్ షుగర్ లెవల్స్..**

షుగర్ ఉన్నవారికి రాగుల మొలకలు ఓ వరమనం చెప్పొచ్చు. ఇందులో పాలిఫెనాల్స్, డైటరీ ఫైబర్ కంటెంట్ ఉంటుంది. కాబట్టి, ఇది షుగర్ లెవల్స్‌ని కంట్రోల్ చేయడంలో మరింత ఎఫెక్టివ్‌గా పనిచేస్తుంది. రాగుల్లోని పీచు రక్తంలో చక్కెర శోషణని నెమ్మదిస్తుంది. దీంతో చక్కెర స్థాయిలు కంట్రోల్ అవుతాయి. కాబట్టి, కచ్చితంగా షుగర్ ఉన్నవారు రాగి మొలకల్ని తింటే షుగర్ కంట్రోల్ అవుతుంది.

**బరువు తగ్గడం..**

మొలకెత్తిన రాగుల్లో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది వెయిట్‌లాస్‌కి మేలు చేస్తుంది. ఈ మొలకలు తీసుకోవడం వల్ల కడుపు నిండుగా ఉంటుంది. దీంతో కేలరీలని తగ్గిస్తాం. అతిగా తినరు. దీంతో బరువు తగ్గుతారు. పోషకాలు కూడా శరీరానికి అందుతాయి.

**రక్తహీనత దూరం..**

మొలకెత్తిన రాగుల్ని తీసుకుంటే రక్తహీనత సమస్య దూరమవుతుంది. రాగుల్లో ఐరన్ పుష్కలంగా ఉంటుంది. ఇది రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయిని పెంచడంలో సాయపడుతుంది. మిల్లెట్స్‌ని ఆహారంలో చేర్చుకోవచ్చు. రక్త ప్రసరణ పెరుగుతుంది. దీంతో పాటు ఐరెన్ లెవల్స్ పెరిగి రక్తహీనత దూరమవుతుంది. ఇది మీ బాడీని హెల్దీగా, శక్తివంతంగా చేస్తుంది.

**కొలెస్ట్రాల్ తగ్గడం..**

హై కొలెస్ట్రాల్ స్థాయిలను కంట్రోల్ చేయడంలో స్ప్రౌటెడ్ మిల్లెట్స్ చాలా బాగా పనిచేస్తాయి. రెగ్యులర్‌గా రాగుల మొలకల్ని తీసుకుంటే కొలెస్ట్రాల్ కంట్రోల్ అవుతుంది. ఎందుకంటే, ఇందులో అమైనో యాసిడ్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి లివర్ ఫ్యాట్‌ని తగ్గించి, గుండె ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయి. అమైనో యాసిడ్స్ కొలెస్ట్రాల్‌ని కంట్రోల్ చేయడంలో సాయపడతాయి. దీంతో గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.

**మిల్లెట్స్ స్మూతీ..**
**పోషకాలు, రిఫ్రెష్ స్మూతీ కోసం మొలకెత్తిన రాగులని ఇష్టమైన పండ్లు, పెరుగు, కొద్దిగా తేనెతో కలిపి స్మూతీలా చేసుకుని తాగండి.**
**సలాడ్ : మొలకెత్తిన మిల్లెట్స్‌ని తాజా కూరగాయలు, ఆకుకూరలతో కలపి హెల్దీ సలాడ్‌లా తయారుచేసుకోవచ్చు.**
**ఇడ్లీ దోశ : వీటితో చక్కగా ఇడ్లీ, దోశల్లా తయారు చేసుకుని తినొొచ్చు. దీని వల్ల మిల్లెట్స్‌లోని హెల్దీ బెనిఫిట్స్ అందుతాయి.**



**జీర్ణక్రియకి మేలు..**

ఎండాకాలంలో జీర్ణవ్యవస్థ మందగించి గ్యాస్, అసిడిటీ, కడుపునొప్పి వంటి సమస్యలు వస్తాయి. వేయించిన ఆహార పదార్థాలు, హెవీ ఫుడ్ తీసుకున్న తర్వాత గ్యాస్, అసిడిటీ, కడుపునొప్పి సమస్యలొస్తాయి. దీనికోసం మీరు బ్రేక్‌ఫాస్ట్‌లో మొలకెత్తిన మిల్లెట్స్ తీసుకుంటే జీర్ణవ్యవస్థ బలోపేతం అవుతుంది. దీని వల్ల జీర్ణ సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. రాగి మొలకల్లో ఎక్కువ ఫైబర్ కంటెంట్ ఉంటుంది. ఇది జీర్ణక్రియని ప్రోత్సహించి జీర్ణ సమస్యల్ని దూరం చేస్తుంది.

**ఎలా వాడొచ్చు..**

మీ డైట్‌లో మొలకెత్తిన రాగులని వాడడం చాలా ఈజీ. దీనిని సలాడ్స్, స్మూతీల్లా చేసుకోవచ్చు. బ్రేక్‌పాస్ట్‌లో యాడ్ చేయొచ్చు.

**గంజి..**

ఈ మొలకల్ని మీరు నీరు, పాలతో ఉడికించి పంచదార, చిటికెడు ఉప్పు కలిపి తీసుకోవచ్చు. మీకు ఇష్టమైతే పండ్లు, డ్రై ఫ్రూట్స్ యాడ్ చేయొచ్చు.

### ఈ ఆయుర్వేదిక చిట్కాతో 30 రోజుల్లోనే

# శరీరంలోని కొలెస్ట్రాల్ మాయం



శరీరంలో కొలెస్ట్రాల్ ఏర్పడకుండా ఉండేందుకు ఎన్నో మార్గాలున్నాయి. ఆయుర్వేద వైద్యం అనేది ఒక పురాతన వైద్య విధానం. వేదాల్లో ఎన్నో సమస్యలకు పరిష్కారాలు కూడా ఉన్నాయి. కాకపోతే త్వరిత గతిన ఆరోగ్య సమస్యలకు పరిష్కారాలను పొందాలన్న ఆశతో ఎక్కువ మంది అల్లోపతి వైద్యాన్ని ఆశ్రయిస్తుంటారు. అల్లోపతితో పోలిస్తే ఆయుర్వేదానికి సంబంధించిన ఏ మందులు తీసుకున్నా సరే సైడ్ ఎఫెక్ట్స్ తక్కువగా వస్తాయి. ఆయుర్వేదంలో కొలెస్ట్రాల్ శరీరంలో పేరుకుపోకుండా ఒక సింపుల్ చిట్కా ఉంది. భోజనానికి ముందు ప్రతిరోజు ఒక స్పూన్ అల్లం పొడిలో చిటికెడు రాతి ఉప్పును వేసి కలుపుకుని తింటే ఎంతో మంచిది. లేదా దానిని నీటిలో కలుపుకుని తాగినా మంచి ఫలితం ఉంటుంది. భోజనానికి ముందు ఇది తీసుకుంటే శరీరంలో కొలెస్ట్రాల్ ఏర్పడకుండా అడ్డుకుంటుంది. కడుపు ఉబ్బరాన్ని కూడా తగ్గించడంతో పాటు మెరుగైన జీర్ణక్రియను అందిస్తుంది. రాతి ఉప్పు అంటే శుద్ధి చేయని ఉప్పులో పొటాషియం, మెగ్నీషియం, కాల్షియం అధికంగా ఉంటాయి. ఇవి ఎలక్ట్రోలైట్లను సమతుల్యం చేయడానికి ఉపయోగపడతాయి. అంతే కాకుండా మొత్తం జీర్ణ ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తాయి. అల్లంలో కూడా ఎన్నో యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు ఉంటాయి. ఇవి జీర్ణ వ్యవస్థకు సంబంధించిన చిన్న చిన్న సమస్యలను కూడా తగ్గిస్తాయి. అల్లంలో జింజరాల్ వంటి బయోయాక్టివ్ సమ్మేళనాలు కూడా ఉంటాయి. ఇది కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది. అల్లం రక్తంలోని మంచి కొలెస్ట్రాల్ స్థాయిలను పెంచి చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తుంది. ఇది రాతి ఉప్పులోని ముఖ్యమైన ఖనిజాలతో కలిస్తే కొలెస్ట్రాల్‌ను సమర్ధవంతంగా అడ్డుకుంటుంది. కాబట్టి రాతి ఉప్పు, అల్లం పొడిని వేసి ప్రతి రోజు భోజనానికి ముందు తినడం అలవాటు చేసుకోండి. ఇలా తినడం కాస్త కష్టంగానే ఉంటుంది. అలాంటప్పుడు కాస్త గోరు వెచ్చని నీటిలో ఈ మిశ్రమాన్ని కలిపి తాగితే మంచి ఫలితం ఉంటుంది. అల్లం, రాతి ఉప్పు కలిపి తీసుకోవడం వల్ల పేగుల్లో గ్యాస్ట్రిక్ ఏర్పడడం తగ్గుతుంది. జీర్ణక్రియ లక్షణాలు కూడా బాగా మెరుగుపడతాయి. జీర్ణ రసాలు కూడా ఉత్పత్తి అవుతాయి. పొట్టలోని ఆమ్లాలు అన్నీ సమతుల్యం అవుతాయి. ఇది పోషకాలను బాగా గ్రహిస్తుంది. ప్రతి భోజనానికి 15 నిమిషాల ముందు గోరువెచ్చని నీటిలో ఒక స్పూన్ అల్లం పొడి, చిటికెడు రాతిపొడి వేసి బాగా కలుపుకుని ఆ నీటిని తాగేయాలి. ఇలా తాగిన 20 నిమిషాల తర్వాత భోజనాన్ని తినాలి. ఇలా చేస్తే 30 రోజుల్లోనే మీకు మంచి ఫలితాలు కనిపిస్తుంది. అంతే కాకుండా మీ శరీరంలోని కొలెస్ట్రాల్ కూడా తగ్గుతుంది.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com